మనం
అనంతపురం / శ్రీ సత్యసాయి జిల్లా
శనివారం - 17 - అక్టోబర్ - 2026 : పేజీలు 8

# నామినేషన్ కేంద్రాల్లో ఎస్పీ ఆకస్మిక తనిఖీలు



- 100 మీటర్ల పరిధిలో 144 సెక్షన్ అమలు
- నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు
- ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలి: ఎస్పీ సతీష్ కుమార్

**హిందూపురం అక్టోబర్ 16 (మనంన్యూస్) :** హిందూపురం మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పట్టణంలోని నామినేషన్ స్వీకరణ కేంద్రాలను జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ గురువారం పోలీసు అధికారులతో కలిసి పరిశీలించారు. నామినేషన్ల ప్రక్రియ సందర్భంగా చేపట్టిన భద్రతా ఏర్పాట్లు, పోలీసు బందోబస్తును ఆయన తనిఖీ చేశారు.హిందూపురం మున్సిపాలిటీలోని మొత్తం 52 వార్డులకు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎంజీఎం ఉన్నత పాఠశాల, మున్సిపల్ కార్యాలయంలో నామినేషన్ స్వీకరణ కేంద్రాలను మిగతా 2లో

# గొల్లపల్లి రిజర్వాయర్‌లో విషాద ఘటన

▪ ఐదుగురు మహిళలు మృతి ▪ మృతులకు మంత్రి సవిత నివాళులు

▪ మృతుల కుటుంబాలను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపిన మంత్రి



**పెనుకొండ అక్టోబర్ 16 మనంన్యూస్ :** పెనుకొండ మండలంలోని గొల్లపల్లి రిజర్వాయర్‌కు విహారయాత్రకు వెళ్లి రిజర్వాయర్ లో మునిగి ఐదుగురు మహిళలు మృతి చెందిన ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. పెనుకొండ పట్టణం లోని దర్గాపేట ఇసకవంక ప్రాంతానికి చెందిన అశ్విని (23), గాయత్రి (45), పుష్ప (30), మాహిన్ (17), హసీనా(40) ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయారు. విహారయాత్ర విషాదాంతంగా మారడంతో బాధిత కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనపై రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి సవిత తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సంతోషంగా గడపాల్సిన సమయంలో ఇలాంటి దుర్ఘటన చోటుచేసుకోవడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, మంత్రి సవిత అక్కడికి చేరుకుని మృతదేహాలకు నివాళులర్పించారు. అనంతరం మిగతా 2లో

# స్థానిక సంస్థల ఎన్నికలను
# అడ్డుకునేందుకు వైసీపీ కుట్రలు

✦ అల్లర్లు సృష్టించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం ✦ ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ




**అనంతపురం అక్టోబర్ 16 మనం న్యూస్ :** స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకూడదని దురుద్దేశం తో మొదటి నుండి వైసీపీ పార్టీ కుట్రలు, కుతంత్రాలు పన్నుతోందని,అల్లర్లు సృష్టించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని,ఎన్ని కుట్రలు కుతంత్రాలు సృష్టించిన కూటమి అభ్యర్థులు భారీ మెజార్టీతో వందకు వందశాతం స్థానిక సంస్థలు ఎన్నికలలో గెలుపొందుతామని ఎంపీ అంబిక లక్ష్మీనారాయణ పునరుద్ఘాటించారు. శుక్రవారం అనంతపురంలోని జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పుంగనూరు, రాయచోటి ప్రాంతాల్లో జరిగిన అల్లర్లు, స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో నెలకొన్న పరిస్థితులపై నిర్వహించిన మీడియా సమావేశంలో అనంతపురం పార్లమెంట్ సభ్యుడు అంబికా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా, ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగించే విధంగా దాడులు, దౌర్జన్యాలకు పాల్పడటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని,ప్రజల మద్దతుతో కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ముందుకు సాగుతోందని, ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజల తీర్పును స్వీకరించాల్సిందేనని స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఓటమి భయంతో అల్లర్లు సృష్టించి, ప్రత్యర్థి అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడం, ఎన్నికల ప్రక్రియను భంగపరచడం వంటి చర్యలను సహించరాదని పేర్కొన్నారు. 2020–21 స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో చోటుచేసుకున్న ఘటనలను ప్రజలు ఇంకా మర్చిపోలేదని, అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు. ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని మిగతా 2లో




# ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణపై అధికారులకు శిక్షణ



➲ ఎన్నికల విధుల్లో అప్రమత్తత.. నిబంధనల అమలులో పారదర్శకత

➲ పోలింగ్ నుంచి ఓట్ల లెక్కింపు వరకు పకడ్బందీగా వ్యవహరించాలి



**పుట్టపర్తి, అక్టోబర్ 16 మనంన్యూస్ :** ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణలో అధికారులు పూర్తి అప్రమత్తతతో వ్యవహరించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎ. శ్యామ్ ప్రసాద్ సూచించారు. ఎన్నికల నియమావళిని క్షుణ్ణంగా అధ్యయనం చేసి, ప్రతి దశలో నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని స్పష్టం మిగతా 2లో

## ధర్మవరంలో మున్సిపల్ నామినేషన్ల వేళ ఉద్రిక్తత..

# ఇరు వర్గాల మధ్య రాళ్ల దాడి..!

పలువురికి గాయాలు.. రంగంలోకి దిగిన పోలీసులు, లాఠీచార్జితో చెదరగొట్టిన జిల్లా ఎస్పీ సతీష్ కుమార్





**ధర్మవరం అక్టోబర్ 16, మనంన్యూస్ :** మున్సిపల్ కౌన్సిలర్ ఎన్నికల నామినేషన్ల సందర్భంగా ధర్మవరం పట్టణంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నామినేషన్లు దాఖలు చేసేందుకువచ్చినవైఎస్సార్‌సీపీ, బీజేపీ, టీడీపీ వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకోవడంతోపరస్పరం రాళ్లు రువ్వుకున్నట్లు సమాచారం. ఈఘటనలో పలువురికి గాయాలయ్యాయి. పరిస్థితి అదుపు తప్పకుండా జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆధ్వర్యం లో మిగతా 2లో





## నామినేషన్ కేంద్రాల్లో ఎస్పీ ఆకస్మిక తనిఖీలు

ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు శాఖ గట్టి బందోబస్తు ఏర్పాటు చేసింది. నామినేషన్ కేంద్రాల పరిసరాల్లో 100 మీటర్ల వరకు 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో హిందూపురంలో పోలీస్ యాక్ట్ 30తో పాటు 144 సెక్షన్ అమల్లో ఉందన్నారు. కౌన్సిలర్, చైర్‌పర్సన్ పదవులకు పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ కేంద్రాల వద్ద ఎలాంటి అలజడి, వివాదాలకు తావివ్వకుండా ఎన్నికల నియమ నిబంధనలను పాటించాలని సూచించారు.నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా జరిగేలా రాజకీయ పార్టీల నాయకులు, అభ్యర్థులు, వారి మద్దతుదారులు పోలీసు,ఎన్నికలఅధికారులకు సహకరించాలనికోరారు.ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని ఎస్పీ స్పష్టం చేశారు.





## ఎన్నికల దృష్ట్యా కుందుర్పిలో అన్ని రాజకీయ పార్టీల సమావేశం

**కుందుర్పి అక్టోబర్ 16 (మనంన్యూస్):** మండల పరిషత్ మరియు జిల్లా ప్రజా పరిషత్ ఎన్నికలదృష్ట్యా కందుర్పి మండల పరిషత్ కార్యాలయంలో రేపు అనగా శనివారం 17.న ఉదయం 11:00 గంటలకు అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో అత్యవసర సమావేశం నిర్వహి స్తున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.నాగలింగేశ్వర రెడ్డి,ఎఆర్ఓ ,ఇ, లక్ష్మి శంకర్ శుక్రవారం మనం సీనియర్ జర్నలిస్ట్ కు తెలిపారు.ఈ సమావేశం మండల ప్రత్యేక అధికారి కె,నాగలింగేశ్వర రెడ్డి అధ్యక్షతన మండలప్రజాపరిషత్ సమావేశ మందిరంలో ఈ సమావేశం జరుగుతుందని, వారు పేర్కొ న్నారు.కావున కుందుర్పి మండలపరిధిలోని అన్నిరాజకీయ పార్టీలకు సంబంధించిన ప్రతినిధులుతప్పనిసరిగా హాజరుకావాలని ఆయనఈసందర్భంగావిజ్ఞప్తి చేశారు. ఈ అవకాశంను సద్వి నియోగం చేసుకోవాలని ప్రతినిదులు ను కోరారు.

## స్థానిక సంస్థల ఎన్నికలను అడ్డుకునేందుకు వైసీపీ కుట్రలు

విజ్ఞప్తి చేశారు.పెన్షన్ల పెంపు, ఉచిత గ్యాస్ సిలిండర్లు, అన్న క్యాంటీన్లు, యువతకు ఉపాధి అవకాశాలు, తల్లికి వందనం వంటి సంక్షేమ కార్యక్రమాలతో కూటమి ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని పొందుతోందని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునే వాతావరణాన్ని కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిస్తూఎన్నికలు శాంతియుతంగాజరిగేందుకు రాజకీయపార్టీలు, అధికారులు సహకరించాలని ఎం.పి.పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా టీడీపీఅధ్యక్షులు పూల నాగరాజు , గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం , ఎమ్మెల్సీ దలవాయి రమాదేవి, వెంకట శివుడు యాదవ్, టౌన్ బ్యాంక్ చైర్మన్ జె.ఎల్.మురళి , ఆర్య కటిక కార్పొరేషన్ చైర్మన్ శ్రీహరి , వెంకటేశ్వర్ రెడ్డి,దలవాయి వెంకటనారాయణ, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## ఉలవలు కోసం రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోండి



– రొళ్ల ఏఓ వెంకటబ్రహ్మం

**రొళ్ల, అక్టోబర్ 16,మనంన్యూస్:** తీవ్ర వర్షభావం కారణంగా ప్రత్నామయ పంట సాగులో భాగంగా మండలంలోని రైతులకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న ఉలవలు కోసం రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిందిగా రొళ్ల ఏఓ వెంకటబ్రహ్మం తెలిపారు.శుక్రవారం తన కార్యాలయంలో విలేకరులతో అయన మాట్లాడుతూ స్థానిక వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వెలుగు కార్యాలయంలో ఉలవలు కావాల్సిన రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఏపీసిఎన్ఎఫ్ సేంద్రియ సిబ్బంది పర్వేక్షణలో విత్తన శుద్ధి(పిల్లటైజేషన్) పద్ధతులు ద్వారా అవగాహన పెంచుకుని ఉలవ విత్తనాలను పొందాల్సిందిగా ఏఓ వెంకటబ్రహ్మం కోరారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణపై అధికారులకు శిక్షణ

మొదటిపేజీ తరువాయి...

చేశారు.శ్రీ సత్యసాయి జిల్లా పరిధిలో ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి శుక్రవారం పుట్టపర్తి ఎంపీడీవో కార్యాలయంలో రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, ఎంపీడీవోలు, ఇతర సంబ ంధిత అధికారులకు సమగ్ర శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉప కలెక్టర్, మాస్టర్ శిక్షకుడు గోవిందరాజులు ఎన్నికల నిర్వహణపై అధికారులకు పలు అంశాలను వివరించారు.ఎన్నికల ప్రకటన విడుదల నుంచి నామినేషన్ల స్వీకరణ, పత్రాల పరిశీలన వరకు అనుసరించాల్సిన నిబంధనలపై అవగాహన కల్పించారు. పోలింగ్ సిబ్బందికి శిక్షణ, పోలింగ్ సామగ్రి పంపిణీ, పోలింగ్ నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రారంభం నుంచి ముగింపు వరకు పకడ్బందీగా నిర్వహించడం, ఫలితాల ప్రకటనలో అనుసరించాల్సిన విధానాలపై సూచనలు అందించారు.ఎన్నికల విధులకు సంబంధించి అధికారులు నిబంధనల పుస్తకాన్ని పూర్తిగా చదివి, తమకు అప్పగించిన బాధ్యతలపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల నిర్వహణలో ఏవైనా సందేహాలు ఎదురైతే ఉన్నతాధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలనితెలిపారు. జిల్లాపరిషత్‌ముఖ్య కార్యనిర్వహణాధికారి లేదాజిల్లాశిక్షణసమన్వయ అధికారి, డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ విజయప్రసాద్‌ను సంప్రదించాలనిసూచించారు.పోలింగ్ నిర్వహణ వ్యవస్థ, ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అంతర్జాల వేదికల్లో అవసరమైన నివేదికలను ఎప్పటికప్పుడు, ఖచ్చితమైన వివరాలతో నమోదు చేయాలని ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియలో సమన్వయం, సమయపాలన, పారదర్శకతకు ప్రాధాన్యంఇవ్వాలనిపేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి వెంకట సుబ్బయ్య, జిల్లా శిక్షణ సమన్వయ అధికారి, డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ విజయప్రసాద్, వివిధ శాఖల జిల్లా అధికారులు, డివిజనల్ అభివృద్ధి అధికారులు, ప్రత్యేక అధికారులు,సహాయరిటర్నింగ్అధికారుల హోదాలో ఉన్న ఎం పీడీవోలు తదితరులు పాల్గొన్నారు

## ధర్మవరంలో మున్సిపల్ నామినేషన్ల వేళ ఉద్రిక్తత.. ఇరు వర్గాల మధ్య రాళ్ల దాడి..!

పోలీసులు రంగంలోకి దిగి లాఠీచార్జి చేసి ఇరువర్గాలను చెదరగొట్టారు.

నామినేషన్ల కేంద్రం వద్ద ఘర్షణ...శుక్రవారం ధర్మవరం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద నామినేషన్లు దాఖలు చేసేందుకు వచ్చిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సాయికుమార్‌పై దాడి జరిగినట్లు ఆ పార్టీ వర్గాలు ఆరోపించాయి. మరోవైపు, 29వ వార్డు నుంచి 48వ వార్డు వరకు కౌన్సిలర్ నామినేషన్ల స్వీకరణకు ఏర్పాటు చేసిన బీఎస్ఆర్ ఉన్నత పాఠశాల వద్ద కూడా ఇరు వర్గాల మధ్య ఘర్షణ చెలరేగింది. మాటామాటా పెరిగి పరస్పరం రాళ్లు రువ్వుకోవడంతో పలువురు గాయపడినట్లు తెలిసింది.తీవ్ర గాయాలు.. మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలింపు. ఈ ఘటనలో బత్తలపల్లి మండలానికి చెందిన భగిరి భయపరెడ్డి, ఓబులనాయనపల్లికి చెందిన ఆదినారాయణనాయుడు,అప్రాచెరువుప్రాంతానికి చెందిన ఈశ్వరయ్య తీవ్రంగా గాయపడినట్లు సమాచారం. క్షతగాత్రులను స్థానికులు తొలుత ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి పంపించారు. అలాగే మరోవైపు, వైఎస్సార్‌సీపీ నాయకులు గుండా ఈశ్వరయ్య, బాల గోపాల్, హరినాథ్‌లపై టిడిపి నాయకులు దాడి జరిగినట్లు కూడాఆయా వర్గాలుఆరోపించాయి. ఈ ఘటనలో ఎవరు ముందుగా దాడికి దిగారు, ఘర్షణకు



దారితీసిన అసలు కారణాలేమిటనే అంశాలపై అధికారికంగా పూర్తి వివరాలు వెల్లడికావాల్సి ఉంది. పోలీసుల చర్యల సందర్భంగా

పరిస్థితిని అదుపులోకి తెచ్చిన పోలీసులు... ఇరువర్గాల మధ్య ఘర్షణ తీవ్రత పెరగడంతో జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ నేతృత్వంలో భారీగా పోలీసులు మోహరించారు. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి లాఠీచార్జి చేసి అక్కడున్న నాయకులు, కార్యకర్తలను చెదరగొట్టారు. దీంతో నామినేషన్ల కేంద్రం పరిసరాల్లో నెలకొన్న ఉద్రిక్తతను అదుపులోకి తీసుకొచ్చేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు.

చట్టం ముందు అందరూ సమానమే: హరీష్ బాబు...ఈ ఘటనపై మంత్రి ప్రతినిధి హరీష్ బాబు పోలీసులతో వాగ్వాదానికి దిగినట్లు సమాచారం. కూటమి ప్రభుత్వ నాయకులపై దాడులు జరుగుతుంటే పోలీసులు సమానంగా వ్యవహరించడం లేదంటూ ఆయన అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలిసింది. చట్టం ప్రకారం అందరికీ సమానన్యాయంచేయాలని, ఘటనపై నిష్పక్షపాతంగా వ్యవహరించాలని ఆయన కోరినట్లు సమాచారం. నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా సాగాల్సినసమయంలో చోటుచేసుకున్న ఈ ఘర్షణ ధర్మవరంలోరాజకీయ వాతావరణాన్ని వేడెక్కించింది. ఎన్నికల ప్రక్రియకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.బీజేపీనాయకులు జమీర్, మహేష్‌లకు గాయాలైనట్లు ఆయా వర్గాలు పేర్కొన్నాయి.



## గొల్లపల్లి రిజర్వాయర్‌లో విషాద ఘటన

మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఆర్డిఓ ఆనంద్ కుమార్,రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య, పట్టణ కన్వీనర్ శ్రీరాములు, ఇస్లాపురం మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు లక్ష్మీనారాయణ రెడ్డి,త్రివేంద్ర నాయుడు,మాధవ నాయుడు, హుజూరుల్లా ఖాన్, దాదు,రియాజ్,బాబుల్ రెడ్డి పాల్గొన్నారు.





## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగాలి

**నంబులపూలకుంట అక్టోబర్ 16 మనంన్యూస్:** మండలం పరిధిలోని టీఎన్ పల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా పోటీకీ బరిలో నిలవనున్న కోలా బాబును యాదల్ల రాజేష్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కోలా బాబుకు శుభాకాంక్షలు తెలిపిన ఆయన, ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకొని ముందుకు సాగాలని పలు కీలక సూచనలు చేశారు. గ్రామ ప్రజల కష్టసుఖాలను దగ్గరగా తెలుసుకుంటూ, ప్రతి కుటుంబానికి అందుబాటులో ఉండాలని సూచించారు. తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, డ్రైనేజీ వంటి మౌలిక సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలను చెప్పుకునేందుకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వాటి పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని హితవు పలికారు. పదవి కోసం కాదు.. ప్రజాసేవ కోసం రాజకీయాల్లో ముందుకు సాగాలి అని సూచిస్తూ, గ్రామ అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని యాదల్ల రాజేష్ ఆకాంక్షిం చారు. ప్రజల విశ్వాసాన్ని పొందుతూ, యువతను కలుపుకొని గ్రామానికి అవసరమైన అభివృద్ధి కార్యక్రమాల సాధన దిశగా అడుగులు వేయాలని తెలిపారు. ఈ సందర్భంగా కోలా బాబు మాట్లాడుతూ, గ్రామ ప్రజల ఆదరాభిమానాలకు అనుగుణంగా ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ, టీ.ఎన్ పల్లి అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.



# పుట్టపర్తిలో నామినేషన్ల కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్

▪ ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా.. ప్రశాంతంగా సాగాలి ▪ అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదు.. అధికారులకు జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాలు



**పుట్టపర్తి, అక్టోబర్ 16 మనంన్యూస్ :** మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, పూర్తి పారదర్శకతతో విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎ. శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. నామినేషన్ల దాఖలు కోసం వచ్చే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. ఎన్నికల నిర్వహణలో నిబంధనలనుతూచాతప్పకుండాపాటిస్తూ, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత వాతావరణంలో ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలో మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ తొలిరోజైన శుక్రవారం ఎనుములపల్లి బీసీ వసతి గృహంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను కలెక్టర్ స్వయంగా తనిఖీ చేశారు. అభ్యర్థుల నుంచి నామినేషన్ల స్వీకరణకు ఏర్పాటు చేసిన పరిపాలనా విభాగాలు, సహాయ కేంద్రాలు, అభ్యర్థుల సౌకర్య కేంద్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎన్నికల విధుల కోసం సిబ్బంది నియామకం, అవసరమైన నామినేషన్ పత్రాల లభ్యత,అభ్యర్థులరాకపోకల నిర్వహణ, జనస మూహ నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకు చేపట్టిన ఏర్పాట్లపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ల స్వీకరణ నుంచి పత్రాల పరిశీలన వరకు ప్రతి దశలో ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటించాలని రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల సిబ్బందికి సూచించారు. నామినేషన్లు దాఖలు చేసే అభ్యర్థులు, వారి ప్రతి పాదకులకుఅవసరమైన సహకారం అందించాలని, ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని స్పష్టంచేశారు. ఎన్నికల నిర్వహణలో పారదర్శకత, క్రమశిక్షణ,బాధ్యతాయుతమైనవిధానాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. మున్సిపల్ ఎన్నికలను స్వేచ్ఛాంయుతంగా, నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా ఎన్నికల యంత్రాంగం సిద్ధంగా ఉందని కలెక్టర్ తెలిపారు. ఈ తనిఖీలో పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, మున్సిపల్ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు



## స్థానిక ఎన్నికల్లో హింసను ప్రోత్సహిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న జగన్ రెడ్డి

– టిడిపి జిల్లా అధ్యక్షుడు, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు




**అనంతపురం అక్టోబర్ 16 మనంన్యూస్ :** స్థానిక ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో వైసిపి నాయకులు చేస్తున్న అలజడలపై అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో చోటు చేసుకుంటున్న రాజకీయ పరిణామాలపై అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం జిల్లా టీడీపీ అధ్యక్షుడు, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ , ఎమ్మెల్సీ దళవాయి రమాదేవి, కార్మిక సంక్షేమ బోర్డు చైర్మెన్ వెంకటశివుడు యాదవ్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పూల నాగరాజు మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో టీడీపీ కూటమిని అడ్డుకోవడానికి వైసీపీ అధినేత జగన్ కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్య విలువలను పక్కనపెట్టి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. జగన్ హింసను నమ్ముకుంటే, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభివృద్ధి, సంక్షేమాన్ని నమ్ముకున్నారని పేర్కొన్నారు. ప్రజలు అన్ని విషయాలను గమనిస్తున్నారని, ఈ ఎన్నికల్లో జగన్‌కు మరోసారి తగిన బుద్ధి చెబుతారని ధీమా వ్యక్తం చేశారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాయచోటి, పుంగనూరు, అన్నమయ్య, ధర్మవరం జిల్లాల్లో వైసీపీ నాయకులు అరాచకాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అల్లర్లు, దాడులకు పాల్పడిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే ప్రతిపక్ష నాయకులు భయంతో గొడవలకు దిగుతున్నారని విమర్శించారు. ప్రజలు ప్రతి పరిణామాన్ని గమనిస్తున్నారని, తగిన సమయంలో తమ తీర్పు ద్వారా సమాధానం చెబుతారని అన్నారు. ఎమ్మెల్సీ దళవాయి రమాదేవి , కార్మిక సంక్షేమ బోర్డు చైర్మెన్ వెంకటశివుడు యాదవ్ మాట్లాడుతూ వైసీపీ నాయకులు ఓటమి భయంతోనే దాడులు, అల్లర్లకు పాల్పడుతున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలను ఎదుర్కోవాల్సింది పోయి, భయాందోళనలు సృష్టించడం సరికాదన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు వైసీపీకి తగిన గుణపాఠం చెబుతారని, ఆ పార్టీ రాజకీయంగాతీవ్రంగానష్టపోయేపరిస్థితి వస్తుందని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ప్రశాంతమైన ఎన్నికల వాతావరణం నెలకొనేలా ఎన్నికల అధికారులు, పోలీసులు చర్యలు తీసు కోవాలని, హింసకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు. ఈ సమావేశంలో అరెకటిక కార్పొరేషన్ చైర్మన్ హరికృష్ణ, అర్బన్ బ్యాంక్ చైర్మన్ జె. ఎల్. మురళి పాల్గొన్నారు.




# తాగునీటి కోసం మహిళల రాస్తారోకో

**గుడిబండ అక్టోబర్ 16 మనంన్యూస్ :** నెలలు గడుస్తున్న తాగునీటి కష్టాలు తప్పడం లేదని తాగునీటి కోసం కిలోమీటర్ల దూరంలోని వ్యవసాయ బోరుబావులను ఆశ్రయించాల్సి వచ్చిన అక్కడ కూడా తా గునీరు నింపడం లేదని ఇక చేసేది లేక రోడ్డుపై ధర్నా చేయాల్సి వచ్చిందని గుడిబండ మండలం చిగాతూర్పి గ్రామమహిళలు శుక్రవారం ఆందోళన వ్యక్తం చేశారు. దసరా పండుగ వచ్చినా ఇల్లు శుభ్రం చేసుకోవడానికి కానీ తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడ్డామన్నారు. ట్యాంకుల ద్వారా తాగు నీటిని సరిపరిచేయడని అధికారుల ను బ్రతిమాలిన ఫలితం లేదన్నారు. రోడ్లకు అడ్డంగా ముళ్ళకంపలు కట్టెలు వేసి ఖాళీ బిందెలతో మహిళలు నిరసన వ్యక్తం చేయటంతో రోడ్డుపై రాకపోకలు గంటల కొద్ది నిలిచిపోయాయి. ప్రభుత్వం వారు తాగునీటి కోసం కొత్త బోర్ వేస్తే అందులో నీరు కూడా సమృద్ధిగా వచ్చాయి అయితే ఆ బోర్ బావికి కొత్త మోటారు



బిగించకపోవడంతో తాగునీటికి కష్టాలు ఎదురయ్యాయి అన్నారు. కొత్త బోర్ వేసి నాలుగు నెలలు గడిచిన అధికారులు కానీ ప్రజాప్రతినిధులు కానీ పట్టించుకోవడం లేదన్నారు. గ్రామంలో తాగునీటి కోసం ఐదు బోరు బావులు ఉన్న అందులో సమృద్ధిగా నీరు రాకపోవడంతో ఇళ్ల దగ్గర ఉన్న కొళాయిల్లో తాగునీరు రావటం లేదన్నారు. తాగునీటి కోసం ఐదు బోరు బావులు ఉన్న అందులో నీటి సమస్య ఉండడంతో తీవ్ర ఇబ్బందులుఎదుర్కొంటున్నామన్నారు. అధికారులు స్పందించిగ్రామానికితగునీరు అందించే ఆదుకోవాలని చిగతూర్పి గ్రామ మహిళలు కోరుతున్నారు.

## వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డిపై దాడి అమానుషం

టిడిపి గుండాలు దాడి పట్ల తీవ్ర ఖండన

వైసీపీ బిసి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు హలుకూరు కాంతరాజు



**అమరాపురం, అక్టోబర్ 16, మనంన్యూస్:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాయలసీమ రీజినల్ కో ఆర్డినేటర్,ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిపై జరిగిన దాడి అమానుషమని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బిసి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, రాయలసీమ ఎత్తిపోతల పథకం టాస్క్ ఫోర్స్ జిల్లా కో ఆర్డినేటర్,ఎచ్ కె ఆర్ డెవలపర్స్ అధినేతహలుకూరు కాంతరాజు దాడిని తీవ్రంగా ఖండించారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ ఎంపీ స్థాయి ప్రజా ప్రతినిధి మిథున్ రెడ్డిపై టీడీపీ గుండాలు దాడికి పాల్పడటం ప్రజాస్వామ్య వ్యవస్థపై దాడి చేయడమేనని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. జెడ్ ప్లష్ భద్రత ఉన్న వ్యక్తిపై సైతం తెలుగుదేశం పార్టీ గుండాలు దాడికి తెగబడటం రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితికి అద్దం పడుతోందన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్ని వ్యవస్థలను ఉపయోగించుకుని అణచివేతకు పాల్పడినా, ప్రాణాలకు తెగించైనా ప్రజల పక్షాన పోరాటం చేసేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందని అయన స్పష్టం చేశారు. ఎంపీ మిథున్ రెడ్డిపై జరిగిన దాడిని కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణించి, ఘటనపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కాంతరాజు డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ ఓటమి తథ్య మని భావించిన కూటమి నాయకులు ఇలా ప్రతిపక్ష పార్టీ వైసీపీకి చెందిన ఎంపీ పెద్ది రెడ్డి మిథున్ రెడ్డి పై దాడికి పాల్పడటం సిగ్గుచేటని హలుకురు కాంతరాజు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఈకార్యక్రమంలోవైసీపీ శ్రేణులు,నాయకులు, జగనన్న సైనికులు పాల్గొన్నారు.

## ఈ - పంట నమోదు చేసుకున్న ప్రతి రైతు తప్పనిసరిగా ఈ - కేవైసీ చేయించుకోవాలి

– మండల వ్యవసాయ శాఖ అధికారి మంజునాథ్



**అమరాపురం, అక్టోబర్ 16,మనంన్యూస్:** ప్రస్తుత ఖరీఫ్ 2026 సీజన్‌కు సంబంధించి వ్యవసాయ భూముల్లో పంట నమోదు ఈ – పంట చేసుకున్న ప్రతి రైతు కూడా తప్పనిసరిగా ఈ – కేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకో వాల్సిందిగా అమరాపురం మండల వ్యవసాయ శాఖ అధికారి మంజునాథ్ తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ?ప్రభుత్వం అందించే వివిధ సంక్షేమ పథకాలు, ఇన్పుట్‌సబ్సిడీ(ఎరువులు, విత్తనాలరాయితీ),అలాగేపంటలబీమా (ఇన్సూరెన్స్) పరిహారం పొందాలంటే ఈ – కేవైసీ అత్యంత కీలకమని ఆయన స్పష్టం చేశారు. ఈ – పంట నమోదు చేసుకుని, ఈ – కేవైసీ పూర్తి చేయని రైతులకు భవిష్యత్తులో ప్రభుత్వ సహాయం, బీమా లబ్ధి అందే అవకాశం ఉండదని ఆయన తెలిపారు. కావున మండలంలోని రైతులందరూ వెంటనే తమ సమీప రైతు సేవా కేంద్రలలో గానీ, లేదా సంబంధిత గ్రామ వ్యవసాయ సహాయకులు(ఏఇఓ / విఏఏ) సంప్రదించి సంప్రదించి, తమ ఆధార్ వేలిముద్రలు (బయోమెట్రిక్ ) లేదా ఐరిస్ ద్వారా ఈ–కేవైసీ ప్రక్రియను త్వరగా పూర్తి చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మంజునాథ్ కోరారు.

## ఉదుగూరు శ్రీ కెంచమాంభ దేవికి ప్రత్యేక పూజలు

– దేవాలయం పట్టం పూజరప్ప సిద్దేశ్వరప్ప స్వామి



**అమరాపురం, అక్టోబర్ 16,మనంన్యూస్:** అమరాపురంమండలం, ఉదుగూరు గ్రామంలో వెలసిన కుంచిటి వక్కలిగా సోమేనల్ళి జానకల్లు గోత్రంనకు చెందిన వారి ఇంటి దేవత శ్రీ కెంచమాంభ దేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు దేవస్థానం పట్టంపూజారప్ప సిద్దేశ్వరప్పస్వామి తెలిపారు. నవరాత్రిమహోత్సవ వేడుకల్లో భాగంగా అమ్మ వారికి వివిధ భిషేకములు జరిపి, కుంకుమర్చనలు చేసి ప్రత్యేక అలంకరణ చేసి నైవేద్యం సమర్పించి మహా మంగళ హారతి, తీర్థ ప్రసాదం వితరణ చేసారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఈ ప్రాంత వాసులే కాకుండా కర్నాటక, ఉమ్మడి అనంతపురం జిల్లాలాలకు చెందిన వివిధ ప్రాంతాలనుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# నేడు రొళ్లలో కూటమి శ్రేణుల సమావేశం

– టిడిపి మండల కన్వీనర్ ఈరన్న



**రొళ్ల, అక్టోబర్ 16,మనంన్యూస్:** నేడు శనివారం మండల కేంద్రమైన రొళ్లలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ శ్రేణుల సమావేశం నిర్వహించనున్నట్లు రొళ్ల మండలం తెలుగుదేశం పార్టీ కన్వీనర్ జికె ఈరన్న తెలిపారు. శుక్రవారం విలేకరులతో అయన మాట్లాడుతూ తవరలోనే జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా జడ్పీటీసీ,ఎంపీటీసీ, అభ్యర్థులను ఎంపిక చేసేందుకు ఈ అత్యవసర సమావేశంను ఏర్పాటు చేసినట్లు అయన తెలిపారు. కావున నేడు శనివారం రొళ్ల పట్టణంలోని శ్రీలక్ష్మీప్యాలేష్‌లో ఉదయం 10గంటలకుజరిగేసన్నాహక సమావేశంనకుటిడిపి,జనసేన,బీజేపీ శ్రేణులు అధికసంఖ్యలోపాల్గొని సమావేశంను జయప్రదం చేయాల్సిందిగా టిడిపి మండల కన్వీనర్ ఈరన్న కోరారు.

# గుడిబండ ఎంపీటీసీ సర్పంచులు పోటీ స్థానాలు రిజర్వేషన్లు ఖరారు

– ఎంపీడీఓ డాక్టర్ కేశవరెడ్డి



**మడకశిర, అక్టోబర్ 16,మనమన్యూస్:** త్వరలోనే గుడిబండ మండలంలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా ఎంపీటీసీ, సర్పంచులు స్థానాల రిజర్వేషన్లు ఖరారు అయినట్లు గుడిబండ ఎంపీడీఓ డాక్టర్ పి. కేశవ రెడ్డి తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో విలేకరులతో అయన మాట్లాడుతూ గుడిబండ మండలంలో మొత్తం 15 ఎంపీటీసీ స్థానాల్లో 1 చిన్న స్వారగిరి ఎస్సీ మహిళా. 2 దేవరహట్టి అన్ రిజర్వుడు మహిళా.3 గుడిబండ 1 ఎస్సీ జనరల్. 4 గుడిబండ 2 బిసి మహిళా. 5 గుణేమోరు బాగులు బిసి జనరల్. 6 జమ్ములబండ అన్ రిజర్వుడు జనరల్. 7 కరికెర అన్ రిజర్వుడు జనరల్.8 కెఎన్ పల్లి బిసి జనరల్. 9 కొంకల్లు అన్ తిజర్వుడు జనరల్. 10 మందలపల్లి అన్ రిజర్వుడు జనరల్. 11 మోరుబాగులు అన్ రిజర్వుడు మహిళా . 12 ముతుకూరు అన్ రిజర్వుడు మహిళా. 13 రాళ్లపల్లి అన్ రిజర్వుడు మహిళా. 14 శంకరగల్లు ఎస్సీ జనరల్. 15 తాళికెర ఎస్సీ మహిళా. పై విదంగా ఎంపీటీసీ స్థానాలు రిజర్వేషన్లు ఖరారు అయినట్లు ఎంపీడీఓ తెలిపారు.16 గ్రామ పంచాయతీలలో సర్పంచు స్థానాల్లో చిగతుర్పి బిసి జనరల్.సీసీ గిరి ఎస్సీ మహిళా.దేవరహట్టి అన్ రిజర్వుడు మహిళా.గుడిబండ అన్ రిజర్వుడు మహిళా.గుణేమోరుబాగులు బిసి మహిళా.జమ్ములబండ అన్ రిజర్వుడు జనరల్.కరికేర అన్ తిజర్వుడు జనరల్.కొంకల్లు అన్ రిజర్వుడు జనరల్.కుంబరనాగేపల్లి బిసి జనరల్.మందలపల్లి అన్ రిజర్వుడు మహిళా.మోరుబాగులు అన్ రిజర్వుడు మహిళా.ముత్తుకూరు అన్ రిజర్వుడు జనరల్.రాళ్లపల్లి బిసి మహిళా.ఎస్. రాయపురం ఎస్సీ జనరల్.శంకరగల్లు ఎస్సీ జనరల్.తాళికెర ఎస్సీ మహిళా పై విదంగా రిజర్వేషన్లు ఖరారు అయినట్లు ఎంపీడీఓ కేశవరెడ్డి వివరించారు.

# ట్రాఫిక్ నిబంధనలను పాటించకపోతే చర్యలు తప్పవు

– అమరాపురం ఎస్ఐ వలీబాష

**అమరాపురం, అక్టోబర్ 16,మనంన్యూస్:** అమరాపురంమండలంలో ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలను తుచా తప్పకుండా పాటించాలని లేని పక్షంలో అలాంటి వారిపై చట్టరీత్యా చర్యలు తప్పవని అమరాపురం ఎస్ఐ ఎస్. వలీబాషా తెలిపారు. మండల కేంద్రమైన అమరాపురం శుక్రవారం వారపు సంత సందర్భంగా ఎస్ఐతో పాటు తన పోలీస్ సిబ్బందితో బస్టాండ్, సంత మార్కెట్ తదితర ప్రాంతాలలో రోడ్డుకు అడ్డంగా నిలబెట్టిన వాహనదారులకు పోలీసులు తమదైన శైలిలో హెచ్చరికలు జారీ చేసారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ రోడ్డు నిబంధనలను పాటించకుండా ఎక్కడ పడితే అక్కడ వాహనాలు పార్కింగ్ చేస్తే మాత్రం చర్యలు తప్పవన్నారు.మద్యం సేవించి వాహనాలు నడిపితే మాత్రం నిబంధనలు మేరకు జరిమానా తప్పదన్నారు. తమ తమ వాహనాలకు సంబందించిన రికార్డులు తప్పనిసరిగా పోలీసులకు చూపించాలన్నారు. డ్రైవింగ్ లైషన్స్ లేకుండా రోడ్డుపైకి వస్తే మాత్రం చర్యలు తప్పవన్నారు. హెల్మట్ ధరించి వాహనాలను నడపడాలన్నారు. పట్టణంలో ప్రజలు రాకపోకలకు అంతరాయశీ కలిగిస్తే మాత్రం చూస్తూ ఊరుకునే ప్రసక్తే ఉండదని ఎస్ఐ వలీభాష తనదైన శైలిలో హెచ్చరించారు.



# కదిరిలో అగ్గి రాజుకుంటున్న మున్సిపల్ వేడి

■ అధికార టిడిపి, వైసిపి అభ్యర్థుల ఎంపికలో ఇరు పార్టీలు బిజీ బిజీ ■ గెలుపు గుర్రాలకే టికెట్లు- ఎమ్మెల్యే కందికుంట ■ వైసీపీ చైర్మన్ అబ్యర్తిగా అత్తర్ పర్వీన్ ఫైనల్










**కదిరి అర్బన్ అక్టోబర్ 16 మనం న్యూస్:** కదిరి మున్సిపాలిటీ ఎన్నికలు నామినేషన్ల ప్రక్రియ మొదలు కావడంతో అధికార టిడిపి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, ప్రతిపక్ష పార్టీ నాయకులు మాజీ ఎమ్మెల్యే అత్తర్ చాంద్ బాషా నియోజకవర్గం ఇంచార్జ్ మక్బుల్ తమ పార్టీ అభ్యర్థులను ఎంపిక చేయడంలో బిజీబిజీగా తలమునక లవుతున్నారు. ప్రతిపక్ష వైసిపి పార్టీ చైర్మన్ అభ్యర్థిని మాజీ ఎమ్మెల్యే అత్తర్ చాంద్ బాషా సతీమణి అత్తర్ పర్వీన్ ను ప్రకటించడం అధికార టిడిపి పార్టీ చైర్మన్ అభ్యర్థిని ఎంపిక చేయడానికి పార్టీ అధిష్టానంఫోన్ కాల్ ద్వారా నాయకుల అభిప్రాయాలను సేకరిస్తున్నట్లు సమాచారం. టిడిపి చైర్మన్ ఆశావహులు తమ భవితవ్యం ఈ సర్వే ద్వారా ముడిపడి ఉందని పలువురు టిడిపి ఆశాభహులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా టిడిపి పట్టణ అధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్ సతీమణి షేక్ సమీరా ఇలాహి జువెలర్స్ అధినేత ఇలాహీ సతీమణి ఆర్షియా భాను ,పేరును పార్టీ అధిష్టానం పరిశీలనలో ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. అధికార టిడిపి నాయకులు చాలామంది ఆశావహులు పోటీ పడడంతో వారి పేర్లను పార్టీ అధిష్టానం పరిశీలనలో ఉన్నట్లు ఆశావహులు చెబుతున్నారు. టిడిపి పార్టీ అధిష్టానం ఎవరికి టికెట్ కేటాయించిన అభ్యర్థి గెలుపు కోసం ఆర్థిక ,అంగ బలం అన్ని విధాల ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ చూసుకోవడంతో పాటు వైసీపీ పార్టీ అభ్యర్థి అత్తర్ పర్వీన్‌ను ఆమెకు దీటైన వ్యక్తిని ఎంపిక చేయడానికి అధికార పార్టీ నాయకత్వం పరిశీలిస్తున్నట్లు సమాచారం. కదిరి మున్సిపాలిటీలో చైర్మన్ అభ్యర్థిని అధికార టిడిపి పార్టీ తమ ధీటైన వ్యక్తిని పోటీలో దింపి కదిరి మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకోవడానికి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ కృషి చేస్తున్నారు.



# స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ జండా ఎగుర వేద్దాం

■ అదైర్య పడకండి అండగా ఉంటాం ■ వైసీపీ బిసి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు హాలుకూరు కాంతరాజు



**అమరాపురం, అక్టోబర్ 16,మనంన్యూస్:** త్వరలోనే జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలు జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచులు ఎన్నికల్లో కలసి కట్టుగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జెండా ఎగుర వేద్దామని వైసీపీ బిసి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, రాయలసీమ ఎత్తిపోతల పథకం టాస్క్ ఫోర్స్ జిల్లా కో ఆర్డినేటర్,ఎచ్ కె ఆర్ డెవలపర్స్ అధినేత హాలు కూరు కాంతరాజు తెలిపారు. మండల కేంద్రమైన అమరాపురం పట్టణంలోని శిర క్రాస్ వైసీపీ నాయకుడు గోవిందప్ప నివాసం ఆవరణంలో శుక్రవారం మండల స్థాయి వైసీపీ విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాంతరాజుతో పాటు వైసీపీ కుంచిటి వక్కలిగా అనుబంధ విభాగాల రాష్ట్ర అధ్యక్షుడు జి. రంగేగౌడ్, మడకశిర ఇంచార్జి ఈరలక్కప్పలు హాజరయ్యారు. ఈ సందర్భంగా కాంతరాజు మాట్లాడుతూ త్వరలోనే జరగనున్న స్థానిక సంస్థల జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచులు అభ్యర్థులను అన్ని స్థానాల్లో గెలిపించుకునేందుకు జగనన్న సైనికులు ప్రజలతో మమేకమై తమ వంతు బాధ్యతగా గెలిపించుకుందామని అయన పిలుపు నిచ్చారు. ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా పాలనను గాలికి వదిలేసి రెడ్ బుక్ పాలనతో అన్నివర్గాల ప్రజలు ప్రభుత్వంపై తీవ్ర స్థాయి వ్యతిరేకతో ఉన్నాం న్నారు. కావున జగనన్న సైనికులు ప్రజలతో మమేకమై ప్రభుత్వ వ్యతిరేఖ విధానాలను స్పష్టంగా వివరిస్తూ వైసీపీ అభ్యర్థుల విజయమే ధ్యేయంగా పాటుపడుదామని కాంతరాజు కోరారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచులు అభ్యర్థుల ఎంపికలో జగనన్న సైనికుల అభిష్టం మేరకే ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. అమరాపురం మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలను వైసీపీ కైవసం చేసుకుని కాబోయే ఏపీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి తొలి బహుమతి ఇద్దామని కాంతరాజు కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైసీపీ మండల కన్వీనర్ త్రిలోక్ నాథ్, మాజీ ఎంపీపీ ఈరన్న, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో జగనన్న సైనికులు పాల్గొన్నారు.



# 16 ఎంపీటీసీ స్థానాలు 11గ్రామ పంచాయతీలఎన్నికలకు రిజర్వేషన్లు ఖరారు

– ఎంపీడీఓ రామారావు



**అమరాపురం, అక్టోబర్ 16,మనంన్యూస్:** త్వరలోనే జరగనున్న ఎంపీటీసీ,సర్పంచులు ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల స్థానాలకు రిజర్వేషన్లు ఖరారు అయినట్లు ఎంపీడీఓ డి. రామారావు తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో విలేకరులతో అయన మాట్లాడుతూ అమరాపురం మండలంలో మొత్తం 16 ఎంపీటీసీ స్థానాల్లో ఆలదపల్లి 1 బిసి జనరల్, అమరాపురం 2 (1) ఆన్ రిజర్వుడు జనరల్, అమరాపురం 3 (2)ఆన్ రిజర్వుడు జనరల్,బసవనపల్లి 4 అన్ రిజర్వుడు మహిళా,హాలు కూరు 5 (1)అన్ రిజర్వుడు మహిళా.హాలు కూరు 6(2) అన్ రిజర్వుడు జనరల్.హేమావతి 7(1) ఎస్సీ మహిళా, హేమావతి 8(2) బిసి మహిళా.హేమావతి 9(3) బిసి జనరల్.మద్దనకుంట 10 అన్ రిజర్వుడు మహిళా.నిద్రగట్ట 11ఎస్సీ జనరల్.కె. శివరశీ 12 బిసి మహిళా.తమ్మడేపల్లి 13(1)అన్ రిజర్వుడు మహిళా. తమ్మడేపల్లి 14(2) ఎస్సీ మహిళా.వలస 15 అన్ రిజర్వుడు జనరల్.వి. అగ్రహారం ఎస్సీ జనరల్ పై విదంగా ఎంపీటీసీ స్థానాలు రిజర్వేషన్లు ఖరారు అయ్యాయని ఎంపీడీఓ రామారావు వివరించారు.అదే విదంగా అమరాపురం మండలంలో 11గ్రామ పంచాయతీలకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో పోటీ చేసే అభ్యర్థుల స్థానాలను కూడా రిజర్వేషన్లను ఖరారు చేసినట్లు అమరాపురం ఎంపీడీఓ డి. రామారావు తెలిపారు. 1.ఆలదపల్లి అన్ రిజర్వుడు మహిళా. 2.అమరాపురంఅన్‌రిజర్వుడు మహిళా. 3.బసవన పల్లి అన్ రిజర్వుడు జనరల్.4.హాలుకూరు అన్ రిజర్వుడుమహిళా.5.హేమావతి బిసి జనరల్. 6.మద్దనకుంట బిసి మహిళా.7.నిద్రగట్ట ఎస్సీ జనరల్.8.కె. శివరం ఎస్సీ జనరల్.9.తమ్మడేపల్లి అన్ రిజర్వుడు జనరల్.10.వి. అగ్రహారం ఎస్సీ మహిళా. 11.వలస అన్ రిజర్వుడు మహిళా జనరల్ పై విదంగా తిజర్వేషన్లు ఖరారు అయినట్లు ఎంపీడీఓ రామారావు వివరించారు.




## మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించండి..ఎమ్మెల్యే అమిలినేని

**- కూటమి మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా బుట్నా లక్ష్మీతిమ్మరాజుపేరును ప్రకటించిన ఎమ్మెల్యే అమిలినేని**

**కళ్యాణదుర్గం అక్టోబర్ 16 మనం న్యూస్ :** మున్సిపాలిటీ చైర్మన్ అభ్యర్థిగా టీడీపీ సీనియర్ నాయకుడు బుట్నా తిమ్మరాజు భార్య బుట్నా లక్ష్మీ ని ఎంపిక చేసినట్లు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు ప్రకటించారు. శుక్రవారం పట్టణంలోని బుట్నా తిమ్మరాజు స్వగృహంలో మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా కూటమి నాయకుల నిర్ణయంతో బుట్నా లక్ష్మీ ని ఎంపిక చేసినట్లు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు స్వయంగా మీడియా ముందు ప్రకటించారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే అమిలినేని మాట్లాడుతూ కళ్యాణదుర్గం పట్టణంలో ఎన్నో ఏళ్లుగా పార్టీకి సేవలు అందిస్తున్న బుట్నా లక్ష్మీ కుటుంబంతో పాటు మనం కూడా ప్రతి ఒక్కరు మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని అది సాధ్యం కావాలి అంటే మున్సిపాలిటీలో వైసీపీ పార్టీ అభ్యర్థులకు డిపాజిట్లు రాకుండా కూటమి అభ్యర్థికి మెజారిటీ ఇవ్వాలని, ఇప్పుడు చూస్తున్న అభివృద్ధే కాకుండా రాబోయే రోజుల్లో మున్సిపాలిటీని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా తీర్పు ఇవ్వాలని కోరారు.

## కూటమి ప్రభుత్వంలో దళితులకు తీవ్రమైన అన్యాయం

**- వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు, ప్రభుదాస్**

**నార్పల అక్టోబర్ 16 మనం న్యూస్ :** నార్పల మండలంస్థానిక సంస్థల రిజర్వేషన్లు ఎంపీటీసీ స్థానాలు3, సర్పంచ్ స్థానాలు,3, ప్రకటించడం,దళితుల గుండెల్లో కుంపటిలా మారాయని, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు ప్రభుదాస్ ఆవేదన చెందారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూరాజ్యాంగం ప్రకారం ఎస్సీ సామాజ వర్గానికి 15 శాతం,రిజర్వేషన్లు దక్కాల్సి ఉండగా ప్రస్తుతం చంద్రబాబు ప్రభుత్వం దాని తుంగలో తొక్కి కేవలం, 13,26, శాతం మాత్రమే కేటాయించిందన్నారు దాదాపు రెండు శాతానికి పైగా రిజర్వేషన్లు అడ్డగోలుగా తగ్గించి దళిత సమాజానికి చంద్రబాబు సర్కార్ కోలుకోలేని దెబ్బ కొట్టిందని ధ్వజమెత్తారు జనాభా నిష్పత్ ప్రకారం దక్కాల్సిన చట్టబద్ధమైన హక్కులను ఈ విధంగా దగా చేయడం దారుణం అన్నారు స్థానిక సంస్థల సారథ్యం బాధితుల్లో దళితులు ఎదగకుండా చంద్రబాబు నాయుడు కుట్ర పూరితంగా చేస్తున్నారు రిజర్వేషన్లు శాతం తగ్గించడం వలన ఎంతోమంది అర్హులైన ఎస్సీ నాయకులు పదవులకు దూరమవుతున్నారని ఇది దళితులప్రమాదంపై సాగుతున్న రాజకీయ వివక్షకు నిదర్శనం అని అన్నారు, గత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం హయాంలో ప్రజా నేత వైయస్ జగన్మోహన్ రెడ్డి దేశ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా సామాజిక విప్లవాన్ని తీసుకొని వచ్చి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చట్టబద్ధంగా 50 శాతం రిజర్వేషన్లు కల్పించి ఆ వర్గాలకు ఆర్థిక రాజకీయ ఎదుగుదలకు జగనన్న బాటలు వేశారని తెలియజేశారు చంద్రబాబు నాయుడు ఇప్పటికైనా తన పంతాను మార్చుకొని ఎస్సీలకు రాజ్యాంగ బద్దంగా దక్కాల్సిన 15% రిజర్వేషన్లు తక్షణమే పునర్దించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి సాకే రామాంజనేయులు, సింగనమల నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షులు మంత్రి ఆంజనేయులు, మారుతి నాగేష్ దసరా బుల్లోడు, బండారు జయరాం, ఖాదర్ పెట్ నాగేంద్ర ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# కారు బైకు ఢీకొని మహిళ మృతి

## - అల్లు గుండు సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం

**నల్లచెరువు, అక్టోబర్ 16 (మనంన్యూస్):** నల్లచెరువు మండల పరిధిలోని అల్లు గుండు సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రాధమ్మ (49) అనే మహిళ మృతి చెందారు.పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తనకల్లు మండలం ఎగువ బత్తునవారిపల్లికి చెందిన రాధమ్మ తన భర్త కుమార్‌రెడ్డితో కలిసి ద్విచక్ర వాహనంపై ఎల్ఐసీ కార్యాలయంలో పని నిమిత్తం ఇంటి నుంచి బయలుదేరారు. అల్లు గుండు సమీపానికి చేరుకోగానే కదిరి వైపు వెళ్తున్న కారు వీరి ద్విచక్ర వాహనాన్ని దాటే క్రమంలో బైకు హ్యాండిల్‌ను ఢీకొట్టింది. దీంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడిపోయింది. ఈ ప్రమాదంలో రాధమ్మ తలకు తీవ్ర



గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మొగ్బుల్ భాష తెలిపారు.

## నాణ్యతతోనే నిర్మాణ రంగానికి గుర్తింపు : ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

**-సాయి తీరం విల్లాస్‌కు భూమిపూజ.. పనులకు శ్రీకారం**

**-నిర్మాణాల్లో ప్రమాణాలు పాటించాలి: ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి**





**పుట్టపర్తి, అక్టోబర్ 16 మనం న్యూస్:** నిర్మాణ రంగంలో నాణ్యతే ప్రధానమని, చేపట్టే ప్రతి పనిలో పటిష్టతకు ప్రాధాన్యం ఇవ్వాలని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి సూచించారు. నిర్మాణ పనుల్లో ఉపయోగించే సామగ్రి నుంచి పనుల పూర్తయ్యే వరకు ప్రతి దశలో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ నాణ్యత విషయంలో రాజీపడకూడదని స్పష్టం చేశారు. పుట్టపర్తిలో శుక్రవారం సాయి తీరం విల్లాస్ నిర్మాణానికి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి భూమిపూజ నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నిర్మాణాలు దీర్ఘకాలం మన్నికగా ఉండేలా ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టాలని నిర్వాహకులకు సూచించారు. నాణ్యమైన నిర్మాణాల ద్వారానే వినియోగదారుల విశ్వాసాన్ని పొందగలమని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆధ్యాత్మిక కేంద్రంగా పేరొందిన పుట్టపర్తిలో నిర్మాణ రంగం అభివృద్ధి చెందడం శుభపరిణామమని వారు అభిప్రాయపడ్డారు. పట్టణంలో కొత్త నిర్మాణాలు, మౌలిక వసతుల అభివృద్ధి ఊపందుకోవడం వల్ల స్థానికంగా ఆర్థిక కార్యకలాపాలు పెరిగి, వివిధ రంగాల్లో ఉపాధి అవకాశాలు మెరుగుపడే అవకాశం ఉందన్నారు. అభివృద్ధి పనులు చేపట్టే సంస్థలు నాణ్యత, విశ్వసనీయతకు పెద్దపీట వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సాయి తీరం విల్లాస్ నిర్వాహకులు రమేష్, గంగాధర్ నాయుడు, పీసీ గంగన్న, స్థానిక ప్రముఖులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పుంగనూరులో దాడులు ప్రజాస్వామ్యానికే మచ్చ

**-మిథున్ రెడ్డి కాన్వాయ్‌పై దాడి, వైసీపీ నేతల అడ్డగింతపై పాలే జయరాం నాయక్ తీవ్ర ఆగ్రహం**



**గోరంట్ల అక్టోబర్ 16 మనం న్యూస్:** పుంగనూరులో చోటుచేసుకున్న రాజకీయ ఉద్రిక్తతలు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులపై దాడులు జరిగినట్లు వచ్చిన ఆరోపణలపై గోరంట్ల మండల మాజీ జడ్పీటీసీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పాలే జయరాం నాయక్ తీవ్రంగా స్పందించారు. రాజంపేట ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లోక్‌సభాపక్ష నాయకుడు మిథున్ రెడ్డి కాన్వాయ్‌పై దాడి ఘటనతో పాటు, నామినేషన్లు దాఖలు చేసేందుకు వెళ్తున్న వైసీపీ నాయకులను అడ్డుకోవడం, వాహనాలను ధ్వంసం చేసినట్లు వచ్చిన ఆరోపణలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఆయన విమర్శించారు.

ఎన్నికల ప్రక్రియలో ప్రతి రాజకీయ పార్టీకి, ప్రతి అభ్యర్థికి సమాన అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంతో పాటు అధికార యంత్రాంగంపై ఉందని పాలే జయరాం నాయక్ పేర్కొన్నారు. ఎన్నికల్లో పోటీ చేయడం ప్రతి అర్హుడికి రాజ్యాంగబద్ధమైన హక్కు అని, నామినేషన్లు దాఖలు చేసే సమయంలో అడ్డంకులు సృష్టించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని,

కూటమి ప్రభుత్వం ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తల భద్రత విషయంలో బాధ్యతగా వ్యవహరించాలని ఆయన డిమాండ్ చేశారు. రాజకీయ విభేదాలను దాడులు, బెదిరింపుల ద్వారా పరిష్కరించుకోవడం సరైన విధానం కాదని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

పుంగనూరులో జరిగినట్లు వెల్లడైన ఘటనలపై నిష్పక్షపాతంగా సమగ్ర విచారణ జరిపి, బాధ్యులుగా తేలిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని పాలే జయరాం నాయక్ కోరారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## తొలిరోజే రక్తగాయాలతో ఘర్షణలు.. పోలీసు యంత్రాంగం మేలుకోవాలి

**- ధర్మవరం మున్సిపల్ ఎన్నికల్లో ఓటర్లకు భరోసా కల్పించాలి.. లేదంటే భయాందోళనల మధ్య ఓటు హక్కు వినియోగం!**



**ధర్మవరం అక్టోబర్ 16 మనం న్యూస్:** మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ తొలిరోజే ఘర్షణలు, రక్తగాయాలకు దారితీయడం పట్టణంలో ఆందోళన కలిగిస్తోంది. ప్రజాస్వామ్యబద్ధంగా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగాల్సిన సమయంలో ఇలాంటి సంఘటనలు చోటుచేసుకోవడం ఎన్నికల భద్రతపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ముఖ్యంగా సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించిన వార్డుల్లో పోలీసు యంత్రాంగం మరింత అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరాన్ని ఈ ఘటనలు స్పష్టం చేస్తున్నాయి.

**48 వార్డులు.. 1,06,250 మంది ఓటర్లు**

ధర్మవరం మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 48 వార్డులు ఉండగా, 1,06,250 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాల్సి ఉంది. ఇందుకోసం 134 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. అయితే వీటిలో 14 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. ఇప్పటికే సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించిన అధికారులు, ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. అలాంటి పరిస్థితుల్లో నామినేషన్ల తొలిరోజే ఘర్షణలు చోటుచేసుకోవడం ఆందోళనకు గురిచేస్తోంది.

**ముందస్తు చర్యలున్నా.. ఎందుకీ ఘర్షణలు?**

జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ నేతృత్వంలో పోలీసు యంత్రాంగం గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినప్పటికీ, ముందస్తు చర్యలు తీసుకున్నప్పటికీ ఘర్షణలు చోటుచేసుకోవడం పోలీసుల వ్యూహాల అమలుపై సమీక్ష అవసరాన్ని సూచిస్తోంది. రౌడీషీటర్లను గుర్తించడం, బైండోవర్ చర్యలు చేపట్టడం వంటి చర్యలు తీసుకున్నా, వాటి ప్రభావం క్షేత్రస్థాయిలో ఎంతవరకు ఉందనే అంశాన్ని శుక్రవారం జరిగిన ఘటన నేపథ్యంలో పరిశీలించాల్సి ఉంది. కేవలం బందోబస్తు ఏర్పాటు చేయడం, ముందస్తు హెచ్చరికలు జారీ చేయడంతోనే పోలీసుల బాధ్యత ముగిసిపోదు. ఘర్షణలకు ఆస్కారం ఉన్న ప్రాంతాల్లో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించడం, రాజకీయ వర్గాల మధ్య ఉద్రిక్తతలు పెరగకుండా చూడడం, చట్టాన్ని ఉల్లంఘించే వారిపై నిష్పక్షపాతంగా చర్యలు తీసుకోవడం అత్యంత కీలకం.

**ఓటు వేయాలంటే భయపడాలా?**

ఎన్నికలంటే ప్రజలకు తమ అభిప్రాయాన్ని స్వేచ్ఛగా వ్యక్తపరిచే అవకాశం కల్పించే ప్రజాస్వామ్య పండుగ. కానీ నామినేషన్ల దశలోనే రక్తగాయాలతో కూడిన ఘర్షణలు చోటుచేసుకుంటే, పోలింగ్ రోజు పరిస్థితులు ఎలా ఉంటాయనే ఆందోళన సామాన్య ఓటర్లలో నెలకొనే ప్రమాదం ఉంది. ముఖ్యంగా సమస్యాత్మక ప్రాంతాల్లో నివసించే మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు, ఇతర సాధారణ ఓటర్లు ఎలాంటి ఒత్తిళ్లకు, బెదిరింపులకు గురికాకుండా ఓటు వేయగలరా? అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఓటు వేయడానికి వెళ్లే సమయంలో రాజకీయ ఘర్షణలు ఎదురవుతాయనే భయం ప్రజల్లో ఏర్పడితే, అది స్వేచ్ఛాయుత ఎన్నికల స్ఫూర్తికి విరుద్ధం. అందువల్ల ఓటర్లలో భయాందోళనలు తొలగించడం, వారికి భద్రతపై నమ్మకం కల్పించడం పోలీసు యంత్రాంగానికి తక్షణ కర్తవ్యంగా మారింది.

సమస్యాత్మక వార్డులపై ప్రత్యేక నిఘా అవసరం

14 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించిన నేపథ్యంలో, వాటికి సంబంధించిన ప్రాంతాల్లో పోలీసు బందోబస్తును పరిస్థితులకు అనుగుణంగా పునఃసమీక్షించాలి. నామినేషన్ల ప్రక్రియ నుంచి పోలింగ్, ఓట్ల లెక్కింపు వరకు ప్రతి దశలోనూ ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాల్సిన అవసరం ఉంది.



## ఓటమి భయంతో తాడేపల్లి ప్యాలెస్ నుంచి అల్లర్లకు ఆదేశాలు

**– ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయాలని వైసీపీ కుట్రలు**
**– పార్టీలు మారేవారికి ప్రజలు ఓట్లు పడవు**
**– ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్**

**కదిరి, అక్టోబర్16మనంన్యూస్ :** స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటమి భయంతో వైసీపీ హింసాత్మక రాజకీయాలకు పాల్పడుతోందని, తాడేపల్లి కేంద్రంగా అల్లర్లకు కుట్రలు జరుగుతున్నాయని కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ శుక్రవారం విమర్శించారు. పుంగనూరు, రాయచోటి, తిరుపతి, ధర్మవరం లో ఈ రోజు చోటుచేసుకున్న ఘటనలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికలను ఎదుర్కొని ప్రజల మద్దతుతో గెలవాల్సిన పార్టీలు దాడులు, బెదిరింపులు, హింసాత్మక చర్యలకు పాల్పడటం సరికాదన్నారు. ప్రత్యర్థి అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడం, నామినేషన్ పత్రాలను లాక్కోవడం, అభ్యర్థులను భయభ్రాంతులకు గురిచేయడం, అధికారులపై ఒత్తిడి తీసుకురావడం వంటి చర్యలకు ఎవరైనా పాల్పడితే ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించినట్లేనని పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు 164 స్థానాలతో కూటమికి చారిత్రాత్మక విజయాన్ని అందించారని, ప్రజల మద్దతుతోనే కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తోందని ఎమ్మెల్యే తెలిపారు. పెన్షన్ల పెంపు, ఉచిత గ్యాస్ సిలిండర్లు, అన్న క్యాంటీన్లు, యువతకు ఉపాధి అవకాశాలు, తల్లికి వందనం వంటి కార్యక్రమాల ద్వారా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.గతంలో 2020--21 స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో చోటుచేసుకున్న వివాదాలు, ఆరోపణలు ప్రజలకు గుర్తున్నాయని పేర్కొంటూ, ఈసారి ఎలాంటి హింసకు, అక్రమాలకు తావులేకుండా ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల తీర్పును గౌరవించడం ప్రతి రాజకీయ పార్టీ బాధ్యత అని స్పష్టం చేశారు.రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నాలు ఎవరూ చేసినా అధికారులు చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, ఎన్నికల ప్రక్రియలో పోటీ చేసే ప్రతి అభ్యర్థికి సమాన అవకాశాలు కల్పించాలని కోరారు. నామినేషన్ల స్వీకరణ నుంచి పోలింగ్, ఓట్ల లెక్కింపు వరకు ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరిగేలా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. హింస, బెదిరింపులతో ప్రజాస్వామ్యాన్ని అడ్డుకోలేరు. ప్రజల స్వేచ్ఛాయుత ఓటు హక్కును కాపాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా, శాంతియుతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్ పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**– సామాజిక ఆరోగ్య అధికారి నగేష్**



**గాండ్లపెంట, అక్టోబర్ 16 (మనం న్యూస్):** సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని సామాజిక ఆరోగ్య అధికారి నగేష్ సూచించారు. గాండ్లపెంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సాదలవాండ్లపల్లి, తుమ్మలబైలు గ్రామాల్లో గర్భిణులు, చిన్నారుల వ్యాధి నిరోధక టీకాలు, సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. వైద్యుల సూచనల మేరకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలని, ప్రసవాలు తప్పనిసరిగా ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే చేయించుకోవాలని తెలిపారు. శిశువు జన్మించిన గంటలోపే తల్లిపాలు పట్టించాలని, చిన్నారులకు నిర్ణీత సమయాల్లో టీకాలు వేయించడం ద్వారా ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ కల్పించవచ్చని వివరించారు. వర్షాకాలంలో నీటి నిల్వల కారణంగా దోమలు వృద్ధి చెంది డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. పతి శుక్రవారం డ్రైడే పాటించి ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. నీటి తొట్టెలు, డ్రమ్ములు, పాత టైర్లు, ఇతర పాత్రల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించాలని తెలిపారు. దోమతెరలు వినియోగించడం ద్వారా దోమకాటు నుంచి రక్షణ పొందవచ్చన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పారిశుధ్యం, పౌష్టికాహారంపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. వ్యాధులు వచ్చిన తర్వాత చికిత్స పొందడం కంటే ముందస్తు జాగ్రత్తలతో నివారించుకోవడమే ఉత్తమమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు రెడ్డికుమారి, తబుస్సుమ్, ఆశా కార్యకర్తలు పుష్ప, శ్యామలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ధర్మవరంలో తొలిరోజు ఉద్రిక్తతల నడుమ నామినేషన్లు

**– 48 వార్డులకు 63 నామినేషన్లు.. వైసీపీ నుంచి 47, టీడీపీ నుంచి**
**– టీడీపీ చైర్మన్ అభ్యర్థిగా పరిసే సుధాకర్, వైసీపీ అభ్యర్థిగా కాచర్ల ఆంజనేయులు నామినేషన్**



**ధర్మవరం మనం న్యూస్:** శ్రీ సత్యసాయి జిల్లాలోని ధర్మవరం మున్సిపాలిటీలో ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ తొలిరోజు ఉద్రిక్త పరిస్థితుల మధ్య కొనసాగింది. ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా ధర్మవరం మున్సిపాలిటీలోనే నామినేషన్లు దాఖలయ్యాయి. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం, బీఎస్ఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాల్లో అభ్యర్థులు తమ నామినేషన్లను దాఖలు చేశారు. ధర్మవరం మున్సిపాలిటీలో మొత్తం 48 వార్డులకు గాను తొలిరోజు 63 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో వైఎస్సార్‌సీపీ నుంచి అత్యధికంగా 47, తెలుగుదేశం పార్టీ నుంచి 14, ఇతరుల నుంచి రెండు నామినేషన్లు నమోదయ్యాయి. తొలి రోజే వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలు చేయగా, టీడీపీ అభ్యర్థులు కూడా తమ నామినేషన్లను సమర్పించారు. తెలుగుదేశం పార్టీ చైర్మన్ అభ్యర్థిగా పరిసే సుధాకర్, వైఎస్సార్‌సీపీ చైర్మన్ అభ్యర్థిగా కాచర్ల ఆంజనేయులు నామినేషన్లు దాఖలు చేశారు. అలాగే, 29వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా భీమనేని ప్రసాద్ నాయుడు నామినేషన్ సమర్పించారు. తొలిరోజు నామినేషన్ల వివరాల ప్రకారం బీజేపీ నుంచి ఒక్క వార్డులో కూడా నామినేషన్ దాఖలు కాలేదు. రెండు చోట్ల స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు సమర్పించారు. 13వ వార్డులో అత్యధికంగా నాలుగు నామినేషన్లు నమోదయ్యాయి. మున్సిపాలిటీలోని 9 వార్డుల్లో తొలిరోజు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. రానున్న రోజుల్లో ఆయా వార్డుల్లో నామినేషన్ల దాఖలు పెరిగే అవకాశం ఉంది. నామినేషన్ల స్వీకరణ కోసం మున్సిపల్ కార్యాలయం, బీఎస్ఆర్ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారులు రాంభూపాల్ రెడ్డి, వెంకట రమణయ్య తదితరులు ఆయా కేంద్రాల్లో అభ్యర్థుల నుంచి నామినేషన్లను స్వీకరించారు. నామినేషన్ల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. మొత్తంగా ధర్మవరం మున్సిపాలిటీలో తొలిరోజే 63 నామినేషన్లు దాఖలు కావడంతో ఎన్నికల వాతావరణం వేడెక్కింది. రానున్న రోజుల్లో ప్రధాన పార్టీల నుంచి మరిన్ని నామినేషన్లు దాఖలయ్యే అవకాశం ఉండటంతో రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.

## గోరంట్లలో ఒక్కసారిగా మారిన వాతావరణం!

**–మబ్బుల ముసురు.. ఉరుములు, మెరుపులతో చిరుజల్లులు**
**–వర్షంతో రైతుల్లో కొత్త ఆశలు.. పశువుల మేత కష్టాలు తీరుతాయన్న నమ్మకం!**



**గోరంట్ల అక్టోబర్ 16 మనం న్యూస్:** ఎండలతో అల్లాడుతున్న ప్రజలకు ఒక్కసారిగా వాతావరణం చల్లబడటంతో ఉపశమనం లభించింది. గోరంట్ల పట్టణంలో శుక్రవారం సాయంత్రం వాతావరణం అనూహ్యంగా మారిపోయింది. ఆకాశమంతా నల్లని మేఘాలు కమ్ముకుని, చల్లని గాలులు వీయడంతో వర్షం కురిసే వాతావరణం ఏర్పడింది. కొద్దిసేపటికే ఉరుములు, మెరుపుల నడుమ చిరుజల్లులు ప్రారంభమయ్యాయి. దీంతో పట్టణంలో వాతావరణం ఒక్కసారిగా చల్లబడగా, వర్షపు జల్లులు ప్రజలకు ఆహ్లాదాన్ని పంచాయి. వర్షం కోసం ఎదురుచూస్తున్న రైతుల్లో ఈ వాతావరణ మార్పు కొత్త ఆశలను నింపింది. ముఖ్యంగా పశువుల మేత కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న పశుపోషకులకు ఈ వర్షం కొంత ఊరటనిస్తుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది. వర్షాలు కురిస్తే పొలాలు, బీడు భూముల్లో గడ్డి పెరిగి పశువులకు మేత అందుబాటులోకి వస్తుందని రైతులు భావిస్తున్నారు. ప్రస్తుతం మేత కోసం పడుతున్న ఇబ్బందులు కొంతమేర తగ్గుతాయని ఆశిస్తున్నారు. ఇప్పటికే వర్షాభావ పరిస్థితులతో వ్యవసాయం, పశుపోషణపై ప్రభావం పడుతున్న నేపథ్యంలో ఈ చిరుజల్లులు రైతుల్లో ఆశలు రేకెత్తించాయి. అయితే, ఒక్కసారిగా కురిసే చిరుజల్లుల కంటే భూమి తడిసి, గడ్డి మొలకెత్తేలా తగినంత వర్షపాతం నమోదైతేనే రైతులకు పూర్తి ప్రయోజనం చేకూరుతుంది. వరుణుడు కరుణించి మరిన్ని వర్షాలు కురిపిస్తే పశువులకు మేత సమస్య తగ్గడంతోపాటు వ్యవసాయ పనులకు కూడా కొంత ఊరట లభిస్తుందని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఆకాశంలో మేఘాలు కమ్ముకోవడం, చల్లని గాలులు వీయడం, చిరుజల్లులు పలకరించడంతో గోరంట్ల పరిసర ప్రాంతాల్లోనూ వర్షాలపై చర్చ మొదలైంది. ఈ జల్లులు మరింత విస్తరించి మంచి వర్షంగా మారాలని రైతులు కోరుకుంటున్నారు. ఆకాశం నుంచి జాలువారే ప్రతి చినుకు తమకు ఉపశమనం కలిగించడంతోపాటు పశువులకు పచ్చిమేత అందించే దిశగా ఉపయోగపడుతుందని ఆశిస్తున్నారు. రానున్న రోజుల్లో వర్షాలు విస్తారంగా కురిసి పంటలకు, పశువులకు మేలు చేయాలని అన్నదాతలు వరుణుడిని వేడుకుంటున్నారు.

## ఆత్మీయ ట్రస్టు, యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్య శిబిరం విజయవంతం



**ధర్మవరం అక్టోబర్ 16 మనం న్యూస్ :** ఆత్మీయ ట్రస్టు, యూటీఎఫ్ ధర్మవరం విభాగం సంయుక్త ఆధ్వర్యంలో అనంతపురం నగరంలోని మార్క్ ప్రత్యేక గుండె వైద్యశాల సహకారంతో శుక్రవారం ధర్మవరంలోని కాకతీయ విద్యానికేతన్ పాఠశాలలో నిర్వహించిన ఉచిత గుండె వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరంలో సుమారు 108 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు.ఈ వైద్య శిబిరాన్ని ఆత్మీయ ట్రస్టు అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి, ఉపాధ్యక్షుడు సూర్యప్రకాశ్ రెడ్డి, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు వైద్యులు ఆదిశేషు, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ నాయక్, జిల్లా కార్యదర్శి అమర్ నారాయణరెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణ, సమాజ సంక్షేమమే లక్ష్యంగా ఆత్మీయ ట్రస్టు, యూటీఎఫ్ సంస్థలు నిస్వార్థ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నాయని తెలిపారు. ప్రజలకు గుండె సంబంధిత వ్యాధులపై అవగాహన కల్పించడంతోపాటు, అవసరమైన వైద్య పరీక్షలను ఉచితంగా అందించాలనే ఉద్దేశంతో ఈ శిబిరాన్ని నిర్వహించినట్లు పేర్కొన్నారు.శిబిరంలో గుండె పనితీరును తెలుసుకునే ద్విమితీయ ప్రతిధ్వని పరీక్ష, గుండె విద్యుత్ స్పందన పరీక్ష, రక్తంలో చక్కెర స్థాయుల పరీక్ష, రక్తపోటు పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని 108 మంది వైద్య పరీక్షలు చేయించుకోవడం సంతోషకరమని నిర్వాహకులు తెలిపారు. ఈ శిబిర నిర్వహణకు సహకరించిన మార్క్ వైద్యశాల యాజమాన్యానికి, కాకతీయ విద్యానికేతన్ పాఠశాల యాజమాన్యానికి నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ అందరి సహకారంతో మరిన్ని ప్రజోపయోగ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామని ఆత్మీయ ట్రస్టు ప్రతినిధులు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో మార్క్ వైద్యశాల వైద్యులు నాగరాజు, నిర్వాహకుడు వినోద్‌తోపాటు ధర్మవరం విభాగ యూటీఎఫ్ నాయకులు, ఆత్మీయ ట్రస్టు సభ్యులు రామాంజనేయులు, చంద్రశేఖర్ రెడ్డి, హిదయతుల్లా, వెంకట కిషోర్, పెద్దకోట్ల సురేష్, అమర్నాథ్ రెడ్డి, రవిశేఖర్, పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ వైకాపా చైర్పర్సన్ అభ్యర్థిగా దొడగట్ట హర్షిణి




**కళ్యాణదుర్గం అక్టోబర్ 16 మనం న్యూస్ :** వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా దొడగట్ట హర్షిణి నీ పార్టీ అధిష్టానం ఖరారు చేయడంతో శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయం నందు మున్సిపాలిటీ వ్యాప్తంగా ఉన్న 32 వార్డుల వైకాపా నాయకులు కార్యకర్తలు యువత మహిళలు కార్యాలయం వద్దకు చేరుకుని దొడగట్ట హర్షిణి కు అభినందనలు తెలిపారు. అనంతరం మాజీ ఎంపీ నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య వైఎస్ఆర్సిపి అగ్ర నేతలు బోయతిప్పేస్వామి మాదినేని ఉమామహేశ్వర నాయుడు ముఖ్య నాయకులు మాట్లాడుతూ ప్రత్యర్థి కూటమి మున్సిపల్ అభ్యర్థికి అత్యంత దిట్టైన సమర్థరాలైన అభ్యర్థిగా విద్యావంతురాలు ప్రతి వార్డు మెంబర్ ను అధిక మెజార్టీతో గెలిపించాలి కూటమి ప్రభుత్వ దగా మోసాలు ప్రజలకు చాటి చెప్పి కూటమి హామీలు శూన్యం తెలపాలి పార్టీ గెలుపు కోసం ప్రతి ఒక్కరు సమస్తంగా శ్రమించాలని తెలిపారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న వారిని మినహాయించాలి

**- ఎస్టీయూ నాయకులు**

**అనంతపురం, అక్టోబర్ 16, మనం న్యూస్ :**



పస్తుతం జరగబోతున్న మూడు విధాల ఎన్నికలకు అనారోగ్య కారణాలైన గుండె సంబంధిత వ్యాధులు, కిడ్నీ సమస్యలతో బాధపడుతున్నవారిని, గర్భిణీ స్త్రీలను, చంటి బిడ్డల తల్లులను, నరాల వ్యాధితో బాధ పడుతున్న వారిని, 60 సంవత్సరాలు పైబడిన వారిని, అలాగే ఇతర వ్యాధులతోబాధపడుతున్న వారిని ముందుగానే గుర్తించి ఎన్నికల విధుల నుండి మినహాయించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు నీలూరు రమణా రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రామాంజనేయులు ఒక ప్రకటనలో ఎన్నికల అధికారులను కోరారు.

## ఎన్నికల విధుల నుంచి ప్రత్యేక వర్గాల ఉపాధ్యాయులకు మినహాయింపు కల్పించాలి

**- పోలింగ్ మరుసటి రోజు ఉపాధ్యాయులకు ఓడీ సౌకర్యం కల్పించాలి**

**- ఏపీటీఎఫ్ 1938 అనంతరం జిల్లా శాఖ**

**అనంతపురం, అక్టోబర్ 16 మనంన్యూస్ :** 2026 మున్సిపల్, జిల్లా పరిషత్, గ్రామ పంచాయతీ ఎన్నికల విధుల నుంచి గర్భిణులు, బాలింతలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు, 60 సంవత్సరాలు పైబడిన ఉపాధ్యాయులకు మినహాయింపు కల్పించాలని జిల్లా పరిషత్ సీఈఓ విజయలక్ష్మి, జిల్లా విద్యాశాఖాధికారి అయ్యుబ్ హుస్సేన్‌లకు ఏపీటీఎఫ్ -1938 అనంతపురం జిల్లా శాఖ శుక్రవారం వినతిపత్రం సమర్పించింది. అలాగే ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉపాధ్యాయులకు పోలింగ్ మరుసటి రోజు ఓడీ సౌకర్యం కల్పించాలని కోరింది. ఉపాధ్యాయులు, ఉద్యోగుల ఆరోగ్య పరిస్థితులు, వయోభారం పరిగణనలోకి తీసుకొని తగిన ఆదేశాలు జారీ చేయాలని ఏపీటీఎఫ్ అనంతపురం జిల్లా శాఖ విజ్ఞప్తి చేసింది. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి కులశేఖర్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు రవీంద్ర, ప్రధాన కార్యదర్శి హనుమప్ప, రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటసుబ్బయ్య, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ నాయక్, రాష్ట్ర ఎన్నికల కమిటీ సభ్యులు సాకే భాస్కర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మహమ్మద్ రఫీ, రాష్ట్ర కౌన్సిలర్ ఆంజనేయులు నాయక్, బి.కె.ఎస్. మండల నాయకులు షమీవుల్ల, ఉరవకొండ మండల ప్రధాన కార్యదర్శి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

## అనంతపురంలో నామినేషన్ కేంద్రాల చుట్టూ నిషేధాజ్ఞలు

**అనంతపురం రూరల్, అక్టోబర్ 16, మనం న్యూస్ :**

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ సందర్భంగా, నామినేషన్




కేంద్రాల చుట్టూ నిషేధాజ్ఞలు విధించారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు, శాంతిభద్రతల పరిరక్షణ నిమిత్తం ఈ చర్య తీసుకోబడిందని అనంతపురం అర్బన్ తహసిల్దార్ డి.రాజా తెలియజేశారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నామినేషన్ కేంద్రాల చుట్టూ 100 మీటర్ల పరిధిలో బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 163 (గతంలో సెక్షన్ 144) ప్రకారం నిషేధాజ్ఞలు అమలులోకి వచ్చాయని, ఈ పరిధిలో ప్రజలు, రాజకీయ పార్టీ నాయకులు, కార్యకర్తలు గుంపులుగా గుమిగూడకూడదు. నలుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది ఒకేచోట గుమిగూడడం, ఆయుధాలు లేదా తుపాకులు తీసుకెళ్లడం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడటం పూర్తిగా నిషిద్ధం. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా సాగేందుకు ప్రజలు, పార్టీ నాయకులు అధికారులకు సహకరించాలని కోరారు. నిషేధాజ్ఞలను ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్, తహసీల్దార్ డి..రాజా హెచ్చరించారు.

# శరవేగంగా బృగతీర్థం కోనేరు సుందరీకరణ పనులు

**- ఎమ్మెల్యే కందికుంట ప్రత్యేక చొరవతో అభివృద్ధి పనులు**

**- కోనేరులో మురికినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం**



**కదిరి, అక్టోబర్16మనంన్యూస్:** కదిరి పుణ్యక్షేత్రంలోని శ్రీమత్ ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి వారి బృగతీర్థం (కోనేరు) సుందరీకరణ పనులు కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ ప్రత్యేక చొరవతో శరవేగంగా కొనసాగుతున్నాయి.కోనేరులోకి మురికినీరు చేరే సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించడంతో పాటు, కోనేరు నిర్మాణ పటిష్టతకు అవసరమైన గ్రౌటింగ్ పనులు కూడా చేపడుతున్నారు. కోనేరులోకి మురికినీరు చేరకుండా అవసరమైన చర్యలు తీసుకుంటూ, సంబంధిత అభివృద్ధి పనులను వేగవంతం



చేస్తున్నారు. మురికినీటి సమస్యను తాత్కాలికంగా పరిష్కరించడంతో సరిపెట్టకుండా, భవిష్యత్తులోనూ ఈ సమస్య పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం దిశగా పనులు చేపడుతున్నారు. గ్రౌటింగ్ పనులతో పాటు కోనేరు సుందరీకరణ పనులను సమన్వయంతో కొనసాగిస్తూ, కోనేరు పరిశుభ్రతను కాపాడేందుకు ప్రాధాన్యత ఇస్తున్నారు.పనులు పూర్తయిన అనంతరం బృగతీర్థం కోనేరును పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్ది భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్నది లక్ష్యం. అతి త్వరలోనే ఆహ్లాదకరమైన ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తులు కోనేరును సందర్శించేలా అభివృద్ధి పనులను పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నారు. బృగతీర్థం కోనేరు పవిత్రత పరిరక్షణే లక్ష్యం.. మురికినీటి సమస్యకు శాశ్వత పరిష్కారమే ధ్యేయం.. గ్రౌటింగ్ పనులతో కోనేరు పటిష్టతకు చర్యలు.

# ఎంపీటీసీ,జెడ్పీటీసీ ఎన్నికలపై టీడీపీ ముఖ్య నేతలు సమీక్ష..

**- తెదేపా కూటిమి అభ్యర్థులు ఘన విజయమే లక్ష్యంగా వ్యూహరచన..**

**కూడేరు అక్టోబర్16 (మనం న్యూస్)** ఉరవకొండ నియోజకవర్గం కూడేరు మండల పరిధిలోని ఎంపీటీసీలు, జడ్పిటిసి అభ్యర్థులను ఎన్నికల బరిలో నిలవడానికి, కూడేరు మండల వ్యాప్తంగా ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, పయ్యావుల శ్రీనివాసులు, ఆదేశాల మేరకు, తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి సూచనల మేరకు ఎంపీటీసీలుగా పోటీ చేయుచున్న ఆయా గ్రామాల తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీ నాయకులతో కలిసి సమీక్ష సమావేశంలో ఏర్పాటు చేసి వారి అభిప్రాయాలను తెలుసుకోవడం జరిగినది, గ్రామాలలో పర్యటించినప్పుడు ఎన్నికలలో పోటీ చేయడానికి ముందుకు మేముంటాం మేముంటాం అంటూ పలువురు తెలుగు తమ్ముళ్లు ముందుకు రావడం ఎంతో సంతోషకరమైన విషయం అని, పోటీ చేయదలచుకున్న వారి పేర్లను మంత్రి పయ్యావుల కేశవ దృష్టికి తీసుకువెళ్లడం జరుగుతుందని, పెద్దలు పార్టీ అభ్యర్థులుగా గ్రామస్థాయిలోనే కలిసికట్టుగా ఒకరిని ఎన్నుకోవడం కార్యకర్తల అభిప్రాయాలను తెలుసుకొని మంత్రి పయ్యావుల కేశవ దృష్టికి తీసుకు వెళ్లడం జరుగుతుందని తెలియజేశారు. టీడీపీ కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా అనుసరించాల్సిన కార్యాచరణపై నేతలు సమగ్రంగా చర్చించారు. ఎన్నికల ప్రచార ప్రణాళికలు, క్షేత్రస్థాయిలో నాయకులు, కార్యకర్తల సమన్వయం, ఓటర్లను చైతన్య పరిచే అంశాలపై దిశానిర్దేశం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన ధ్యేయంగా ముందుకు సాగుతూ కూటమి విజయదుందుభి మోగించేలా సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ చోళ సముద్రం మురళి, ప్రధాన కార్యదర్శి గుండా శివయ్య, బాట వెంకటేశులు, జయపురం మర్రి స్వామి,సింగల్ విండో ప్రెసిడెంట్ జయప్రకాష్ గౌడ్, బొమ్మయ్య, క్లస్టర్ ఇంచార్జ్ అరవకూరు ప్రసాద్, భాస్కర్ గౌడ్, కమ్మూరు ఎర్రి స్వామి, చింతల్ నాయుడు, ఇప్పేరు డీలర్ శివ, అల్లా బకాష్,చంద్రన్న, వెంకటరాముడు, బోయ ఎర్రి స్వామి, నాగిరెడ్డిపల్లి రామాంజనేయులు, దేవరాజు, ముట్టాల అక్కలప్ప,హరి ముఖ్యమైన నాయకులు పాల్గొన్నారు.



# పీవీకేకే ఐటీలో ఘనంగా 'తరంగ్ ఉమా 2కె26' ఫ్రెషర్స్ డే వేడుకలు

**- ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు**

**- క్రీడా విజేతలకు బహుమతుల ప్రదానం**




**అనంతపురం, అక్టోబర్ 16 మనం న్యూస్ :** అనంతపురంలోని పీవీకేకే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (అటానమస్) కళాశాలలో శుక్రవారం 'తరంగ్ ఉమా 2కె26' పేరుతో ఫ్రెషర్స్ డే వేడుకలను అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. ద్వితీయ సంవత్సరం బీటెక్ విద్యార్థులు నూతన విద్యార్థులకు ఘనస్వాగతం పలుకుతూ ఏర్పాటు చేసిన ఈ వేడుకలు సందడిగా సాగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జేఎన్‌టీయూ అనంతపురం పరిశోధన, అభివృద్ధి విభాగం డైరెక్టర్ ప్రొఫెసర్ వైశాలి జి.ఘోర్పడే, గౌరవ అతిథిగా కాగ్నిజెంట్ టెక్నాలజీ సొల్యూషన్స్ సీనియర్ మేనేజర్ (రిక్రూట్‌మెంట్ అండ్ హ్యూమన్ రిసోర్సెస్) ఆర్. వెంకటేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ.. ఇంజినీరింగ్ విద్యార్థులు కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా సాంకేతిక నైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్, నాయకత్వ లక్షణాలు, వ్యక్తిత్వ వికాసంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉన్నత అవకాశాలను అందిపుచ్చుకోవాలంటే విద్యార్థులు నిరంతరం కొత్త విషయాలను నేర్చుకుంటూ తమ ప్రతిభను మెరుగుపరచుకోవాలని పేర్కొన్నారు. కళాశాల జీవితం విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది అని, ఈ దశ నుంచే స్పష్టమైన లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు. కళాశాల చైర్మన్ డాక్టర్ పల్లె వెంకట కృష్ణ కిషోర్ మాట్లాడుతూ.. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో అవసరమని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు, పరస్పర సహకార భావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదువులో రాణించి తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఫ్రెషర్స్ డే వేడుకల్లో భాగంగా నిర్వహించిన వివిధ క్రీడా పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. క్రీడలు విద్యార్థుల్లో పోటీతత్వంతో పాటు జట్టుగా పనిచేసే నైపుణ్యాన్ని, క్రమశిక్షణను పెంపొందిస్తాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, సంగీత కార్యక్రమాలు, వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. విద్యార్థుల ఉత్సాహభరిత ప్రదర్శనలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సీనియర్ విద్యార్థులు నూతన విద్యార్థులను ఆత్మీయంగా ఆహ్వానించడంతో కళాశాల ప్రాంగణమంతా పండుగ వాతావరణం నెలకొంది. విద్యార్థుల కేరింతలు, సాంస్కృతిక కార్యక్రమాలతో వేడుకలు ఉల్లాసంగా సాగాయి. కార్యక్రమంలో కళాశాల యాజమాన్య ప్రతినిధి కె.శ్రీకాంత్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ బండి రమేష్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ దీప్తి జోర్డానా, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ కె.మనోహర్ రెడ్డి, హ్యుమానిటీస్ అండ్ సైన్సెస్ విభాగాధిపతి డాక్టర్ నరసప్ప, మహేష్, వివిధ విభాగాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పెన్షన్ అదాలత్‌లో వచ్చిన ఫిర్యాదులను పూర్తి స్థాయిలో పరిష్కరించేందుకు చర్యలు

-- కలెక్టరేట్ లో రెండు రోజులపాటు నిర్వహించిన పెన్షన్, జీపీఎఫ్ అదాలత్ విజయవంతం
-- ఆంధ్రప్రదేశ్ ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ (ఏఅండ్ఈ) ఎస్.శాంతిప్రియ

**అనంతపురం, కలెక్టరేట్ అక్టోబర్ 16 : మనం న్యూస్ :** ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు దృష్టి సారించామని, పెన్షన్ అదాలత్‌లో వచ్చిన ఫిర్యాదులను పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నామని ఆంధ్రప్రదేశ్ ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ (ఏఅండ్ఈ) ఎస్.శాంతిప్రియ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవన్ లో బుధవారం, గురువారం రెండు రోజులు పాటు నిర్వహించిన పెన్షన్, జీపీఎఫ్ అదాలత్ విజయవంతంగా ముగిసిందన్నారు. ఈ రెండు రోజుల కార్యక్రమంలో 75 పెన్షన్ అభ్యర్థనలు, 111 జీపీఎఫ్ అభ్యర్థనలు జారీ చేసినట్లు వెల్లడించారు. అదేవిధంగా పెన్షన్, జీపీఎఫ్, సీఎఫ్ఎంఎస్‌కు సంబంధించిన 160 ఫిర్యాదులకు అక్కడికక్కడే పరిష్కారం అందించినట్లు తెలిపారు. పెన్షన్, జీపీఎఫ్ అదాలత్ లో వచ్చిన అర్జీలను పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. రెండో రోజు గురువారం ఉదయం మరియు మధ్యాహ్నం కూడా అర్జీలను స్వీకరించి అక్కడికక్కడే కొన్నింటికి పరిష్కారం చూపించామని తెలిపారు. ఇక్కడ పరిష్కరించగా మిగిలిపోయిన అర్జీలను అన్నింటినీ విజయవాడకు తీసుకెళ్లామని, వాటిని పూర్తిగా పరిష్కరించే వరకు మానిటర్ చేస్తున్నామని తెలిపారు. ఉద్యోగులు పదవీ విరమణ అనంతరం ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమకు రావాల్సిన ప్రయోజనాలను పొందేలా చూడటంతో పాటు, ప్రస్తుతం సేవలో ఉన్న ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా పరిష్కరించేందుకు దృష్టి పెట్టడం జరిగిందని తెలిపారు. పెన్షన్ అదాలత్‌ను మొదటిసారిగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో నిర్వహించడం జరిగిందన్నారు. రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ కార్యక్రమంలో పెన్షనర్లు, ఉద్యోగుల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు జిల్లా యంత్రాంగానికి, పెన్షనర్లకు, మీడియా మిత్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



## కొలిక్కిరాని టిడిపి చైర్మన్ అభ్యర్థి

**గుంతకల్లు, అక్టోబర్ 17మనం న్యూస్ :** టిడిపి చైర్మన్ అభ్యర్థి కొలిక్కి రాకుండా ఉండడంతో పట్టణ ప్రజలు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే వైయస్సార్సీపి తమ అభ్యర్థిని ప్రకటించిన విషయం తెలిసిందే నామినేషన్ల ప్రక్రియ నేటి నుంచి ప్రారంభమైంది ఇంకా రెండు మూడు రోజుల్లో నామినేషన్ ప్రక్రియ ముగిసిపోయే అవకాశం ఉండడం తో ఇప్పటివరకు చైర్మన్ అభ్యర్థిని ప్రకటించకపోవడం పట్ల ఆశావాహుల్లో నిరాశరేకుతున్నది. శుక్రవారం ఒకరు మాత్రమే చైర్మన్ కు నామినేషన్ వేశారు తెలుగుదేశం పార్టీ అధిష్టానం ఇంతవరకు నోరు విప్పకపోవడంతో ఆశావాహుల్లోఆందోళన మొదలైంది. ఎందుకంటే వైఎస్ఆర్పిపి తమ అభ్యర్థిని ప్రకటించిన నేపథ్యంలో అందుకు తగ్గట్టుగా బలమైన అభ్యర్థిని రంగంలోకి దించాలని టిడిపి భావిస్తుంది అందుకు సమయం తీసుకుంటుందని విశ్వసనీయ సమాచారం. కనీసం శనివారం కైనా తమ అభ్యర్థిని ప్రకటిస్తారని ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే ఎమ్మెల్యేకు అభ్యర్థులు కలసి తమ కేటాయించాలని విన్నవించారు. అయితే పార్టీ అధిష్టానం ఆజ్ఞ మేరకే అభ్యర్థి ఎంపిక ఉంటుందన్న సమాచారం.



## ఎన్నికల్లో డిపాజిట్లు దక్కవని అల్లర్లకు పాల్పడుతున్న వైసిపి

**గుంతకల్లు, అక్టోబర్ 17 మనం న్యూస్ :** స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీకి డిపాజిట్లు దక్కవని తెలిసి అల్లర్లకు పాల్పడుతుందని టిడిపి నాయకులు ఆరోపించారు శుక్రవారం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ ఎన్నికల కూటమి విజయం సాధిస్తుందని తెలిసి శాంతి భద్రతలకు వైఎస్ఆర్పిపి పార్టీ విఘాతంకలిగిస్తున్నదని టిడిపి నాయకులు ఆరోపించారు. ప్రజాబలం సంక్షేమం అభివృద్ధి నేరుగా ప్రజల ముందుకు వెళుతున్న కూటమి ప్రభుత్వానికి ఎవరి మీద చేయవలసిన అవసరం లేదన్నారు. దాడులు ఘర్షణలు ఎవరికి అవసరం అని వారు ప్రశ్నించారు ప్రజల్లో పుట్టగతులు లేక గ్రామాల్లో అడుగుపెట్టే ధైర్యం లేక ఎన్నికలు జరిగితే డిపాజిట్లు కూడా రావని తెలిసి వైసీపీ ముఠాలు అల్లర్లకు పాల్పడుతున్నారు. ఈ ఎన్నికల్లో ఓటర్లు ఇచ్చే తీర్పుతో వైసిపి ఫ్యాక్షన్ సంస్కృతి తాడేపల్లి అహంకారానికి శాశ్వతంగా సమాధి కట్టడం తథ్యమన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు విద్యా రాణి, ఆస్పెల్ మస్తాన్ యాదవ్, తలారి మస్తానప్ప, బండారు ఆనంద్, మల్లికార్జున, సుధాకర్, గుజరి కాజా, శివన్న హనుమంతు, అంజలి ,ఫజల్ సద్దాం జి పాల్గొన్నారు.




## ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిగేలా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలి

: ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ



గార్లదిన్నె అక్టోబర్ 16 మన న్యూస్ : స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలోని పుంగనూరు, రాయచోటి, తిరుపతిలో చోటుచేసుకున్న ఘటనలు వైసీపీ హింసా రాజకీయాలకు నిదర్శనమని శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ గారు విమర్శించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలను ఎదుర్కొనే ధైర్యం లేక, ఓటమి భయంతోనే వైసీపీ నేతలు దాడులు, ఘర్షణలకు తెరలేపుతున్నారని మండిపడ్డారు. తాడేపల్లి కేంద్రంగా సాగుతున్న రాజకీయ కుట్రల్లో భాగంగానే స్థానిక ఎన్నికల ప్రక్రియను అడ్డుకోవడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు.
ప్రజల మద్దతుతో ఎన్నికల్లో విజయం సాధించాలనే ఆలోచనకు బదులుగా, భయభ్రాంతులకు గురిచేసి ప్రత్యర్థులను ఎన్నికల బరిలోకి దిగకుండా అడ్డుకోవడం వైసీపీకి అలవాటుగా మారిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. భారీ సంఖ్యలో రౌడీ మూకలను ఇతర ప్రాంతాల నుంచి తీసుకొచ్చి దాడులకు పాల్పడుతున్నారన్న ఆరోపణలపై అధికారులు సమగ్రంగా విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దళితోనే ప్రత్యర్థి అభ్యర్థులను అడ్డుకోవడం, నామినేషన్ పత్రాలను లాక్కొని చించివేయడం, అభ్యర్థులపై దాడులకు దిగడం, రిటర్నింగ్ అధికారులను బెదిరించడం వంటి ఘటనలతో ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం కలిగించారని విమర్శించారు. 2020–21 స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో చోటుచేసుకున్న పరిణామాలను రాష్ట్ర ప్రజలు ఇంకా మర్చిపోలేదన్నారు. ఇప్పుడు కూడా అదే తరహా రాజకీయాలను కొనసాగించాలని వైసీపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు."ప్రజల మద్దతుతో గెలుస్తామనే నమ్మకం మాకుంది.. దాడులు చేయాల్సిన అవసరం మాకు లేదు" అని ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ స్పష్టం చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో 164 సీట్లతో కూటమి చారిత్రక విజయాన్ని సాధించిందని, ప్రజల ఆశీస్సులతో సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతోందని తెలిపారు. ప్రజల తీర్పును గౌరవించడం, ప్రజాస్వామ్య విలువలను కాపాడటం కూటమి ప్రభుత్వ విధానమని పేర్కొన్నారు.ట్లికి వందనం, అన్నదాత సుఖీభవ, పెన్షన్ల పెంపు, దీపం పథకం, అన్న క్యాంటీన్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి సంక్షేమ కార్యక్రమాలతో కూటమి ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని పొందుతోందని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే తమ బలమని, ప్రజల వద్దకు వెళ్లి తమ పనితీరును వివరించి ఓట్లు కోరుతామని స్పష్టం చేశారు.
వైసీపీ నేతలు ముందుగా ఘర్షణలకు ప్రేరేపించి, అనంతరం బాధితులుగా చిత్రీకరించుకునే రాజకీయాలకు స్వస్తి పలకాలని హితవు పలికారు. ప్రజలను భయపెట్టి, ప్రత్యర్థులను అడ్డుకొని సాధించే విజయం ప్రజాస్వామ్య విజయం కాదని అన్నారు. ఎన్నికల్లో ప్రతి అభ్యర్థికి నామినేషన్ వేసే హక్కు, ప్రతి ఓటరుకు స్వేచ్ఛగా ఓటు వేసే హక్కు ఉందని, ఆ హక్కులకు భంగం కలిగించే ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించకూడదని పేర్కొన్నారు.
ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరిగేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులు ఎంతటి వారైనా చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. సున్నితమైన ప్రాంతాల్లో తగిన భద్రతా ఏర్పాట్లు చేసి, బెదిరింపులు, దాడులు, అక్రమాలకు తావులేకుండా ఎన్నికల ప్రక్రియను నిర్వహించాలని కోరారు.
ఇది గతంలో మాదిరిగా అరాచకాలకు అవకాశం ఇచ్చే పాలన కాదని, రాజ్యాంగం, చట్టాల ప్రకారం నడిచే ప్రజా ప్రభుత్వమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. రౌడీయిజాన్ని, ముఠా రాజకీయాలను ప్రోత్సహించే వారిపై చట్టం తన పని తాను చేసుకుపోతుందని హెచ్చరించారు.
స్థానిక సంస్థల ఎన్నికలు గ్రామాల అభివృద్ధికి, ప్రజాస్వామ్య పరిరక్షణకు కీలకమని పేర్కొన్న ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ గ్రామ స్వరాజ్యాన్ని కాపాడుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. హింసకు, బెదిరింపులకు తలొగ్గకుండా ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. "దాడులు, బెదిరింపులు, అల్లర్లతో ప్రజల తీర్పును మార్చలేరు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిగితే ప్రజలే అంతిమ నిర్ణేతలు. అభివృద్ధి, సంక్షేమం, ప్రజాసేవే కూటమి ప్రభుత్వ అజెండా. స్థానిక ఎన్నికల్లో ప్రజల తీర్పుతో హింసా రాజకీయాలకు, ఫ్యాక్షన్ సంస్కృతికి తగిన సమాధానం లభిస్తుంది" అని ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ స్పష్టం చేశారు.

## 30 అడుగుల ఎత్తులో.. ప్రాణాలకు తెగించి విద్యుత్ మరమ్మతులు!

-కిందకు చూస్తే కళ్లు తిరిగే ఎత్తు.. అయినా వెనకడుగు వేయని విద్యుత్ సిబ్బంది
-ప్రజల భద్రతే లక్ష్యంగా ప్రత్యేక చర్యలు.. సిబ్బంది శ్రమకు స్థానికుల ప్రశంసలు





**గోరంట్ల అక్టోబర్ 16 మనం న్యూస్:** వర్షం.. ఈదురుగాలుల వేళ విద్యుత్ తీగలతో ప్రమాదం పొంచి ఉన్నా.. ప్రజల భద్రత కోసం విద్యుత్ సిబ్బంది సాహసమే ఆయుధంగా ముందుకు సాగారు. దాదాపు 30 అడుగుల ఎత్తున్న నిచ్చెనపై నిలబడితే కిందకు చూస్తేనే కళ్లు తిరిగే పరిస్థితి.. ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా ప్రమాదం సంభవించే అవకాశం! అయినప్పటికీ వెనకడుగు వేయకుండా, తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధి నిర్వహణలో నిమగ్నమయ్యారు. ఎత్తులో నిలబడి విద్యుత్ తీగలను సరిచేస్తూ, ప్రమాదకర పరిస్థితులను చక్కదిద్దుతూ ప్రజలకు భద్రత కల్పించేందుకు వారు పడిన శ్రమ అంతా ఇంతా కాదు. గోరంట్ల పట్టణంలో శుక్రవారం విద్యుత్ సిబ్బంది చేపట్టిన ఈ ప్రత్యేక చర్యలు స్థానికుల ప్రశంసలు అందుకున్నాయి. మండల విద్యుత్ అధికారి శ్రీనివాస్ ఆదేశాల మేరకు పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సమస్యల పరిష్కారంపై సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించారు. ప్రధాన రహదారులతో పాటు వివిధ వీధుల్లో చెట్ల కొమ్మల మధ్య నుంచి విద్యుత్ తీగలు వెళ్లడం, కొన్ని చోట్ల వైర్లు ప్రమాదకరంగా ఉండటం, మరికొన్ని ప్రాంతాల్లో తీగలు తెగిపోయే సూచనలు కనిపించడం వంటి సమస్యలను గుర్తించారు. ముఖ్యంగా వర్షాలు, ఈదురుగాలుల సమయంలో చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలకు తగిలితే ప్రమాదాలు సంభవించే అవకాశం ఉండటంతో ముందస్తు చర్యలకు ప్రాధాన్యమిచ్చారు. ఈ క్రమంలో లైన్‌మెన్లు, విద్యుత్ కార్మికులు ఎంతో శ్రమించి మరమ్మతు పనులు చేపట్టారు. దాదాపు 30 అడుగుల ఎత్తులో నిచ్చెనపై నిలబడి, అత్యంత అప్రమత్తంగా విద్యుత్ తీగల వద్ద పనులు చేయడం సాధారణ విషయం కాదు. కింద నుంచి చూస్తున్న వారికే భయం కలిగించే ఎత్తులోనూ, ప్రమాదాన్ని ఎదుర్కొనే పరిస్థితుల్లోనూ వారు ఏకాగ్రతతో విధులు నిర్వర్తించారు. ఎత్తులో నిలబడి తీగలను సరిచేయడం, సమస్యాత్మక ప్రాంతాల్లో మరమ్మతులు చేపట్టడం వంటి పనులను పూర్తి చేసేందుకు ఎంతో శ్రమించారు. వారి ప్రతి అడుగులోనూ అప్రమత్తత.. ప్రతి పనిలోనూ బాధ్యత కనిపించింది. విద్యుత్ సమస్యలు తలెత్తిన తర్వాత స్పందించడం కంటే, ప్రమాదం జరగకముందే వాటిని గుర్తించి పరిష్కరించడం ఎంతో ముఖ్యమని సిబ్బంది చేపట్టిన చర్యలు చాటిచెప్పాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడటంతో పాటు, ప్రజలకు ప్రమాదాలు ఎదురు కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం అభినందనీయమని స్థానికులు పేర్కొంటున్నారు. విధి నిర్వహణలో భాగంగా సిబ్బంది ఎదుర్కొన్న ఇబ్బందులు, వారు పడిన శ్రమను గుర్తించాలని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.ముఖ్యంగా ప్రధాన రహదారులపై నిత్యం రాకపోకలు సాగించే పాదచారులు, ద్విచక్ర వాహనదారులకు విద్యుత్ తీగల వల్ల ప్రమాదం వాటిల్లే అవకాశం ఉండటంతో ఈ చర్యలు వారికి ఊరటనిచ్చాయి. ప్రజల భద్రత కోసం కష్టపడి పనిచేసిన విద్యుత్ సిబ్బందిపై పట్టణ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. ఇదే విధంగా పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు, తీగలు, చెట్ల కొమ్మల పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలించి, ప్రమాదకర పరిస్థితులు కనిపించిన వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రజలకు వెలుగులు పంచే విద్యుత్ సిబ్బంది.. తమ విధి నిర్వహణలో ఎదుర్కొనే ప్రమాదాలు, పడే శ్రమ వెలకట్టలేనిది. ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా పనిచేసే ఇలాంటి సిబ్బంది సేవలను గుర్తించి అభినందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## తొలి రోజు 13 మంది అభ్యర్థులు నామినేషన్

**గుంతకల్లు, అక్టోబర్ 17 మనం న్యూస్ :** తొలి రోజు 13 మంది అభ్యర్థులు నామినేషన్లను వేశారు. ఇందులో టిడిపి తరఫున ఆరు మంది అభ్యర్థులు వైఎస్ఆర్పిపి పార్టీ తరఫున ఐదు మంది అభ్యర్థులు సిపిఐ తరఫున ఇద్దరు చైర్మన్ ఒకరి నామినేషన్ వేశారు. మున్సిపల్ కార్యాలయంలో నామినేషన్ల సందర్భంగా డీఎస్పి శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకున్నారు.

## సరస్వతి దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చిన కుందుర్పమ్మ

-ధ్యానానికి బ్రహ్మ జ్ఞానానికి ప్రతీక సరస్వతి దేవి.
-6వ రోజు వైభవంగా కొనసాగిన శరన్నవరాత్రులు.



**కుందుర్పి, అక్టోబర్ 16 (మనం న్యూస్):** భక్తులకు గ్రామ దేవత కుందుర్పమ్మ తల్లి సరస్వతి దేవి రూపంలో దర్శనం ఇచ్చారు. శుక్రవారం కుందుర్పిలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు 6వ రోజు ఘనంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం గ్రామ దేవత కుందుర్పమ్మ, కనకదుర్గమ్మ, కన్యకా పరమేశ్వరి, రామస్వామి ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక విశేష పూజలు అర్చనలు నిర్వహించారు. శుక్రవారం సందర్భంగా అమ్మవారు సరస్వతి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు భక్తిశ్రద్ధలతో, నియమనిష్టలతో పూజలు జరిపి అమ్మవారి అనుగ్రహం భక్తులు పొందారు. అమ్మవారిని ఆకు పూజ రకాల పూలమాలతో శోభాయ మానంగా చూపరులను విశేషంగా ఆకట్టుకొనేలా అలంకరించారు. వేద పండితులు మాట్లాడుతూ. ధ్యానానికి బ్రహ్మ జ్ఞానానికి ప్రత్యేక సరస్వతి దేవి అన్నారు. శ్వాస మీద ధ్యాస పెడితే శక్తి పొంది సుస్వరాలను పలక్రిస్తుందన్నారు సరస్వతి దేవి. ఈ దేవి మూర్తి హంస వాహిని ,హంస అంటే శ్వాస మీద ధ్యాస, దేవి చేతిలో ఉన్న వీణలో ఉన్న తీగలే మన శరీరంలో ఉన్న నాడులన్నారు. సరస్వతి దేవి విశిష్టత: చదువుల తల్లి, జ్ఞాన ప్రదాయిని అయిన సరస్వతి దేవిని పూజిస్తే విద్య, బుద్ధి, వాక్ శుద్ధి కలుగుతాయని భక్తుల నమ్మకం. అలా ఆలయాలు కమిటీ వారు తీర్థ ప్రసాదాలను పంచిపెట్టారు . ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

## కుందుర్పి జెడ్పీటీసీ టికెట్ పై ఉత్కంఠ

- టీడీపీలో ఐదుగురు ఆశావహులు పోటీ!
-ఐదుగురిలో ఒకరికి జెడ్పిటిసి సీట్ దక్కేది ఎవరికి.?
-అదిష్టానం ఏవరికి ఎంపిక చేస్తుందో.?

కుందుర్పి, అక్టోబర్ 16 (మనం న్యూస్):. కుందుర్పిమండలానికి జెడ్పిటిసి రిజర్వేషన్ మహిళ జనరల్ కు ఖరారైంది.ఈ క్రమంలోనే జెడ్పీటీసీ టికెట్ పై తమకంటే తమకే టికెట్ దక్కాలని ఆశలతో ఉత్కంఠ నెలకొంది. దింతో టీడీపీలో టికెట్ ఆశిస్తున్న ఆశావహుల మధ్య పోటీ ఆసక్తికరంగా మారింది.టీడీపీ తరఫున జెడ్పీటీసీ బరిలో నిలిచేందుకు ఐదుగురు ముఖ్య నేతలు గట్టి ప్రయత్నాలు చేస్తున్నారని విశ్వసనీయ వర్గాల ద్వారా సమాచారంతెలిసింది .

**టీడీపీ జెడ్పీటీసీ ఆశావహులు:**
మండలంలోని బెస్తరపల్లి రాఘవేంద్ర, నిజవల్లి వాసి తిప్పేస్వామి, కెంచంపల్లి ,ధనుంజయ, జి, రవీంద్ర నాయుడు,కెంచంపల్లి మండల కేంద్రమైన కుందుర్పి గ్రామ వాసి ఎస్. మల్లికార్జునలు కలరు. ఈ ఐదుగురిలో టికెట్ ఎవరికి దక్కుతుంది? బరిలో నిలిచే అభ్యర్థి ఎవరు? అనే దానిపై కుందుర్పి మండల వ్యాప్తంగా చర్చ జోరుగా సాగుతోంది. టీడీపీ అధిష్టానం నిర్ణయంపైనే అందరి దృష్టి నెలకొంది. జెడ్ పిటిసి అభ్యర్థి ఎంపికపై టిడిపి అధిష్టానం అధికారిక స్పష్టత వచ్చే వరకు అభ్యర్థి ఏవరు అనేది వేచి చూడాల్సిందే.

## మిథున్ రెడ్డిపై దాడి అమానుషం మాజీ ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి

**గుంతకల్లు, అక్టోబర్ 17 మనం న్యూస్:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజంపేట పార్లమెంట్ సభ్యుడు, రాయలసీమ ప్రాంతీయ సమన్వయకర్త పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిపై జరిగిన దాడి ఘటనను గుంతకల్లు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు శ్రీ వై. వెంకటరామిరెడ్డి తీవ్రంగా ఖండించారు.శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో రాజకీయ ప్రత్యర్థులను రాజకీయంగానే ఎదుర్కోవాలని, దాడులకు పాల్పడటం ఏమాత్రం సమర్థనీయం కాదని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులపై దాడులు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.పుంగనూరు మున్సిపాలిటీలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసేందుకు వెళ్తున్న సమయంలో అడ్డంకులు సృష్టించారనే ఆరోపణలు, ఎంపీ మిథున్‌రెడ్డి కాన్వాయ్‌పై రాళ్ల దాడి ఘటన ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ ఘటనలో పలువురికి గాయాలయ్యాయని, పలు వాహనాలు ధ్వంసమయ్యాయని వచ్చిన సమాచారంపై సమగ్ర విచారణ జరపాలని కోరారు.రాజకీయ ప్రత్యర్థులను భయభ్రాంతులకు గురిచేసి ప్రజాస్వామ్య హక్కులను అడ్డుకోవడం సరికాదని, ఎన్నికల ప్రక్రియ స్వేచ్ఛగా, ప్రశాంతంగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈఘటనకుసంబంధించినవాస్తవాలను వెలుగులోకి తీసుకువచ్చి, బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్చేశారు.రాజకీయాల్లో హింసకు తావులేకుండా ప్రజాస్వామ్య హక్కులను ప్రతిఒక్కరూగౌరవించాలని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా వై. వెంకటరామిరెడ్డి మాట్లాడుతూదాడులతో మా గొంతును అణచలేరు.. ప్రజల పక్షాన ప్రశ్నించడం ఆపలేరుఅని స్పష్టంచేశారు.వైఎస్సార్‌సీపీ అనంతపురం జిల్లా ఉపాధ్యక్షురాలు శ్రీమతి వై. నైరుతి రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ జింకల రామాంజినేయులు, ఎస్టిసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గోవింద నాయక్ , గుత్తి పట్టణం మైనార్టీ నాయకులు, మొయినుద్దీన్ ,పట్టణ అధ్యక్షుడు ఖలీల్ , వైసిపి నాయకులు ద్యాం వల్లి, పోలింగ్ బూత్ నాయకులు వినోద్ కుమార్ రెడ్డి, నాగిరెడ్డి, ముఖ్యమైన వైసిపి నాయకులు పాల్గొన్నారు.



## మారెమ్మ సన్నిధిలో కళా నైవేద్యం

-సరస్వతీ రూపంలో అమ్మవారు.. భరతనాట్యంతో అలరించిన కర్ణాటక చిన్నారులు
-శాశ్వత అన్నదానానికి రూ.10,116 విరాళం.. గోశాలకు ఆవు బహూకరణ



**గోరంట్ల, అక్టోబర్ 16 మనం న్యూస్:** శరన్నవరాత్రుల పర్వదినాల్లో భక్తి పరిమళాలు వెదజల్లుతూ.. ఆధ్యాత్మిక వైభవానికి సాంస్కృతిక కళారూపాలు తోడవడంతో గోరంట్ల పంచాయతీ పరిధిలోని గుమ్మయ్యగారిపల్లిలోని శ్రీ మారెమ్మ దేవి ఆలయం భక్తజన సందోహంతో కళకళలాడింది. అమ్మవారి అనుగ్రహం కోసం భక్తులు బారులు తీరగా.. సరస్వతీ దేవి అలంకరణలో దర్శనమిచ్చిన శ్రీ మారెమ్మ దేవి భక్తులను భక్తిపారవశ్యంలో ముంచెత్తారు. మరోవైపు కర్ణాటకకు చెందిన చిన్నారులు ప్రదర్శించిన భరతనాట్యం ఆలయ ప్రాంగణానికి కళాత్మక శోభను తీసుకొచ్చింది. భక్తి, సేవ, సంస్కృతి కలగలిసిన ఈ వేడుకలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.



గోరంట్ల పంచాయతీ పరిధిలోని గుమ్మయ్యగారిపల్లిలో వెలసిన శ్రీ మారెమ్మ దేవి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శ్రీ మారెమ్మ దేవి ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ బి. దేవిరాజు స్వామి, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం అమ్మవారిని సరస్వతీ దేవి రూపంలో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఈ సందర్భంగా గోపూజ, అభిషేకం, కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు, ఇతర భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పూజల అనంతరం




తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.ఆకలితో వచ్చినవారికి అన్నం పెట్టడమే మహోన్నత సేవ అన్న సందేశానికి నిదర్శనంగా ఆలయంలో నిర్వహిస్తున్న శాశ్వత అన్నదాన కార్యక్రమానికి ఎస్‌పీఈఎస్ కళాశాల ప్రిన్సిపాల్ కెంపుల లక్ష్మీనారాయణ రూ.10,116 విరాళంగా అందజేశారు. భక్తులకు నిరంతరం అన్నప్రసాదం అందించే పవిత్ర కార్యక్రమానికి ఆయన అందించిన సహకారం పట్ల ఆలయ నిర్వాహకులు హర్షం వ్యక్తం చేశారు.అదేవిధంగా ఆలయానికి విచ్చేసిన భక్తులకు కాంతమ్మ, ప్రభాకర్ రెడ్డి, మల్లికార్జున రెడ్డి, జయమ్మ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులకు అన్నప్రసాదం అందించి సేవాభావాన్ని చాటుకున్నారు.దైవసేవతో పాటు గోసేవకు ప్రాధాన్యమిస్తూ శ్రీ మారెమ్మ దేవి గోశాలకు చిన్నపరెడ్డిపల్లికి చెందిన సరస్వతి, వెంకటేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో ఆవును విరాళంగా అందజేశారు. ఆలయ అభివృద్ధి, శాశ్వత అన్నదానం, గోసేవకు సహకరించిన దాతలను శ్రీ మారెమ్మ దేవి ట్రస్ట్ తరఫున డాక్టర్ బి. దేవిరాజు స్వామి శాలువాలతో సత్కరించి అభినందించారు. భక్తి మార్గంలో దానధర్మాలు, సేవా కార్యక్రమాలు సమాజానికి స్ఫూర్తినిస్తాయని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. దేవీ నవరాత్రి ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన కర్ణాటక చిన్నారుల భరతనాట్య ప్రదర్శన భక్తులను మంత్రముగ్ధులను చేసింది. సంప్రదాయ నృత్యరీతులు, లయబద్ధమైన అడుగులు, హావభావాలతో చిన్నారులు ప్రదర్శించిన కళాప్రతిభకు భక్తుల నుంచి విశేష స్పందన లభించింది. నృత్య ప్రదర్శనతో ఆలయ ప్రాంగణంలో భక్తి, సంగీతం, సంస్కృతి సమ్మేళనం ఆవిష్కృతమైంది.ఈ కార్యక్రమంలో ఎస్‌పీఈఎస్ కళాశాల ప్రిన్సిపాల్ కెంపుల లక్ష్మీనారాయణ, పెనుకొండ ఏజీపీ భాస్కర్ రెడ్డి, పెనుకొండ సీనియర్ జర్నలిస్ట్ జాకీర్, ప్రభాకర్ రెడ్డి, మల్లికార్జున రెడ్డి, వెంకటేష్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో తెదేపా విజయమే లక్ష్యం

- అభ్యర్థుల ఎంపికపై కసరత్తు...
- ఆశావహుల నుంచి రాజకీయ బయోడేటాల సేకరణ..
- వర్గ విభేదాలకు తావులేకుండా సమష్టిగా పనిచేయాలి: మండల కన్వీనర్ రాజశేఖర్ బాబు

**నల్లచెరువు, అక్టోబర్ 16, మనం న్యూస్:** స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని ఆ పార్టీ నల్లచెరువు మండల కన్వీనర్ రాజశేఖర్ పిలుపునిచ్చారు.ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ శ్రేణులంతా ఇప్పటి నుంచే సమాయత్తం కావాలని సూచించారు.గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎన్నికల్లో పార్టీ బలపరిచిన అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని కోరారు.శుక్రవారం కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆదేశాల మేరకు నల్లచెరువులోని గీతా మందిరంలో తెలుగుదేశం పార్టీ మండల స్థాయి సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు,అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ, పార్టీ నాయకులు, కార్యకర్తల బాధ్యతలు తదితర అంశాలపై చర్చించారు.

**రిజర్వేషన్ల వివరాల వెల్లడి...!**
మండల పరిధిలోని జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ పదవులకు సంబంధించిన రిజర్వేషన్ల వివరాలను సమావేశంలో వెల్లడించారు.ఆయా పదవులకు పోటీ చేయాలనే ఆసక్తి ఉన్న ఆశావహులు తమ రాజకీయ అనుభవం, పార్టీతో ఉన్న అనుబంధం, ఇతర సంబంధిత వివరాలతో కూడిన రాజకీయ బయోడేటాను సమర్పించాలని రాజశేఖర్ కోరారు.ఆశావహుల నుంచి స్వీకరించిన బయోడేటాలను ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌కు అందజేస్తామని, ఆయన పరిశీలన అనంతరం అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు.

**పార్టీ నిర్ణయమే ప్రామాణికం...!**
పార్టీ తరఫున పోటీ చేసే అభ్యర్థుల ఎంపికలో పార్టీ నాయకత్వం తీసుకునే నిర్ణయానికి ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని ఆయన



సూచించినట్లు సమావేశంలో పేర్కొన్నారు. పదవుల కోసం పోటీ చేయాలనుకునే ఆశావహులు తమ వివరాలను సమర్పించాలని, అభ్యర్థుల ఎంపిక అనంతరం పార్టీ బలపరిచిన అభ్యర్థుల విజయానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.ఎన్నికల సమయంలో వ్యక్తిగత అభిప్రాయ భేదాలు, వర్గ విభేదాలకు ప్రాధాన్యం ఇవ్వకుండా పార్టీ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకోవాలని అన్నారు. గ్రామాల్లో నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం పెంపొందించుకోవాలని, ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఎన్నికల్లో విజయం సాధించేందుకు ప్రతి కార్యకర్త బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, పార్టీ నాయకత్వం సూచనలకు అనుగుణంగా ముందుకు సాగాలని కోరారు.

**ఆశావహుల్లో ఆసక్తి...!**
స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి రిజర్వేషన్ల వివరాలు వెల్లడించడం, ఆశావహుల నుంచి రాజకీయ బయోడేటాలను సేకరించాలని సూచించడంతో జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ పదవులకు పోటీ చేయాలనుకునే వారిలో ఆసక్తి నెలకొంది. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియపై పార్టీ శ్రేణుల్లో చర్చ సాగుతోంది. ఎమ్మెల్యే పరిశీలన అనంతరం అభ్యర్థుల ఎంపికపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని సమావేశంలో వివరించారు. ఈ కార్యక్రమంలో మండల, గ్రామస్థాయి తెదేపా నాయకులు, స్థానిక సంస్థల పదవులకు పోటీ చేయాలనుకుంటున్న ఆశావహులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ధర్మవరంలో ఉద్రిక్తతలకు వైసీపీ నేతలే కారణం : మంత్రి సత్యకుమార్ యాదవ్



**ధర్మవరం, అక్టోబరు 16 మనం న్యూస్:** ధర్మవరం మున్సిపాలిటీ ఎన్నికల నామినేషన్ల సందర్భంగా చోటుచేసుకున్న ఉద్రిక్తతలకు వైసీపీ నేతల రెచ్చగొట్టే ధోరణే కారణమని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ విమర్శించారు. నామినేషన్ పత్రాలు చించివేశారన్న ఆరోపణల్లో వాస్తవం లేదని, వైసీపీ అభ్యర్థులను అడ్డుకోవాలన్న ఉద్దేశం తమకు లేదని స్పష్టం చేశారు.నామినేషన్ల ప్రక్రియలో ధర్మవరం పట్టణానికి సంబంధం లేని వ్యక్తులు వచ్చి వివాదాలు సృష్టించడంపై మంత్రి అభ్యంతరం వ్యక్తం చేశారు. కొందరిపై క్రిమినల్ కేసులు, బైండోవర్ చర్యలు ఉన్నట్లు సమాచారం ఉందని పేర్కొంటూ, ఘటనపై వాస్తవాలు వెలుగులోకి రావాల్సిన అవసరం ఉందన్నారు.గాయాలయ్యాయని చెబుతూ ప్రభుత్వ ఆసుపత్రిలోని వీల్‌చైర్లను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లడంపై మంత్రి విమర్శించారు. ప్రజలకు వైద్య సేవలు అందించాల్సిన సదుపాయాలను రాజకీయ ప్రచారానికి వినియోగించడం సరికాదన్నారు. గాయాల తీవ్రతపై వైద్య పరీక్షలు, సంబంధిత ఆధారాల ద్వారానే వాస్తవాలు నిర్ధారణ కావాలని పేర్కొన్నారు.గతంలో ప్రజలు వైసీపీని తిరస్కరించడానికి ఇలాంటి రాజకీయ ధోరణులే కారణమని విమర్శించిన సత్యకుమార్ యాదవ్, ఎన్నికల ప్రక్రియను వివాదాస్పదం చేయకుండా అన్ని పార్టీలు సంయమనం పాటించాలని కోరారు. ధర్మవరం మున్సిపాలిటీ ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా, ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# గొడసలపల్లిలో భక్తి వైభవం.. అంగరంగ వైభవంగా భగలాముఖి అమ్మవారి ప్రతిష్ఠాపన

– పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు.. ఆధ్యాత్మిక శోభతో అలరించిన గ్రామం





**డి.హిరేహాల్, అక్టోబర్ 16మనం న్యూస్:** మండల పరిధిలోని గోడసలపల్లి గ్రామంలో శ్రీ భగలాముఖి అమ్మవారి విగ్రహ ప్రాణప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా నిర్వహించారు. మార్కెట్ యార్డు చైర్మన్ హనుమంతరెడ్డి, గ్రామ ప్రజల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఆధ్యాత్మిక వేడుకలకు గ్రామస్థులతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వేద పండితుల మంత్రోచ్చారణలు, ప్రత్యేక పూజలు, శ్రీ దశమహావిద్య హోమాలతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అమ్మవారి విగ్రహ ప్రాణప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాల్లో భక్తులు భక్తిపారవశ్యంతో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.
గ్రామం సుభిక్షంగా ఉండాలి..

**ప్రజలు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలి!**

గొడసలపల్లి గ్రామం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరికీ అమ్మవారి ఆశీస్సులు లభించాలని, ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు వెల్లివిరియాలని భక్తులు ప్రార్థనలు చేశారు. గ్రామ ప్రజల సహకారం, భక్తుల భాగస్వామ్యంతో ప్రతిష్ఠాపన కార్యక్రమాలు విజయవంతంగా ముగిశాయి. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనడంతో గొడిసలపల్లి గ్రామం భక్తి శ్రద్ధలతో పులకించింది.

# స్థానిక ఎన్నికలలో సత్తా చాటుదాం

**అమడగూరు మండలం నుంచే విజయ యాత్రకు నాంది పలుకుదాం**
**వైసీపీ కార్యకర్తల జోలికొస్తే ... ఖబర్దార్... రెడ్ బుక్కు రాజ్యాంగం కుదరదు**
**193 చెరువుల పై పల్లెకు అవగాహన ఉందా.. రాత్రిపూట టెంకాయలు కొట్టే సంస్కృతి పల్లె ది**
**కార్యకర్తల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి పిలుపు**

**అమడగూరు, అక్టోబర్ 16 మనం న్యూస్ :** స్థానిక ఎన్నికల లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సత్తా చాటాలని వందకు వందశాతం విజయ డంక మోగించాలని పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని శ్రీ చౌడేశ్వరి కళ్యాణ మండపంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. తొలిత మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి మండల కేంద్రంలో వెలిసిన శ్రీ చౌడేశ్వరి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటుచేసిన కార్యకర్తల సమావేశంలో దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ స్థానిక ఎన్నికలలో ప్రతి కార్యకర్త విజయమే లక్ష్యంగా పనిచేసే మండలంలోని అన్ని ఎంపీటీ స్థానాలను గెలుపొందాలని ఆయన కార్యకర్తలకు సూచించారు. అమడగూరు మండలం నుంచి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయ యాత్రకు నాంది పలకాలన్నారు. ఎన్నికల సందర్భంగా అది అధికార పార్టీ ఒత్తిళ్లకు తలోగ్గి పోలీసుల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారని పోలీసులు నిష్పత్తిపాతంగా వ్యవహరించాలని ఆయన పోలీసులకు హితవు పలికారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు జోలికి వస్తే ఖబర్దార్ అంటూ ప్రభుత్వాన్ని ఆయన హెచ్చరించారు. రెడ్ బుక్కు రాజ్యాంగం పుట్టపర్తి నియోజకవర్గం లో అమలు చేస్తే మీ ఆటలు చెల్లవని ఆయన తమదైన సైలిలో ప్రభుత్వంపై గురుకుపడ్డారు. ఇకపోతే నిత్యం ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, పల్లె



రఘునాథ్ రెడ్డిలు పుట్టపర్తి నియోజకవర్గం లోని 193 చెరువులు గురించి మాట్లాడుతున్నామని గొప్పలు చెప్తున్నారు తప్ప చేసిందేమీ లేదన్నారు. పల్లెకు 193 చెరువులపై అవగాహన లేదని ఆయన విమర్శించారు. పల్లెకు తెలిసింది ఏందంటే రాత్రిపూట దొంగ చాటుగా టెంకాయలు కొట్టి నేనే చేశాను గొప్పలు చెప్పుకోవడం తప్ప చేసిందేమీ లేదని ఆయన మండిపడ్డారు. పల్లె తన జీవితంలో ఏనాడైనా శాశ్వత పనులు చేశారా నిన్న తీశారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జగనన్న ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రజలకు పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేశామని ఆ పథకాలే మనకు శ్రీరామరక్ష అన్నారు. ఎన్నికల సందర్భంగా జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజలకు తీసుకెళ్లి ప్రచారం నిర్వహించాలని ఆయన కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. వైఎస్ఆర్సీపి నాయకులు కార్యకర్తలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. అనంతరం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి చేతుల మీదుగా ఐడి కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ జయప్ప, నాయకులు దేశాయి నాగేంద్రకుమార్ రెడ్డి, శివశంకర్ రెడ్డి, పొట్ట ఉమాదేవి, భారతి రెడ్డి, మధుసూదన్ రాజు, హరినాథ్ రెడ్డి, ఎస్ పాల్ , సుధాకర్ రాజు, దొడ్డప్ప, నవీన్,, మణికంఠ, సురేందర్ రెడ్డి, సూర్యనారాయణ రెడ్డి, రంగారెడ్డి, శ్రీధర్ రెడ్డి, గోపాల్ రెడ్డి, లోకేశ్వర్ రెడ్డి, శిభక్తుల్లా, తబ్రేజ్, నాగరాజు, లచ్చి, సేవే నాయక్, విష్ణు, జనార్దన్ రెడ్డి, ఆదినారాయణ, అమర, సూర్యనారాయణ రెడ్డి, గోపాల్ రెడ్డి, వెంకట్ రెడ్డి, గంగాద్రి, ఆదినారాయణ రెడ్డి, ప్రతాప్, రవీంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా పరిషత్ చైర్మన్ రేసులో కొనకొండ్ల రాజేష్!

- బీసీ రిజర్వేషన్ నేపథ్యంలో రాజేష్ అభ్యర్థిత్వంపై చర్చ..
- ఎన్డీఏ కూటమి ప్రోత్సాహంపై ధీమా..

**కూడేరు, అక్టోబర్ 15 (మనం న్యూస్)**





అనంతపురం జిల్లా పరిషత్ చైర్మన్ పదవి బీసీలకు రిజర్వు కానున్న నేపథ్యంలో బీజేపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్ పేరు రాజకీయ వర్గాల్లో చర్చకు వస్తోంది. ఎన్డీఏ కూటమిలో భాగంగా జిల్లా పరిషత్ చైర్మన్ పదవిని ఆశిస్తున్న ఆయన, కూటమి నాయకుల మద్దతుతో అవకాశం దక్కుతుందనే ధీమాతో ఉన్నారు.
ఉరవకొండ నియోజకవర్గం కూడేరు మండలం కడదరకుంట గ్రామానికి చెందిన రాజేష్‌కు కురుబ సామాజిక వర్గంలో పట్టుతో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సత్సంబంధాలు బలంగా ఉన్నాయి. 2014లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతో రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన ఆయన, 2020లో బీజేపీలో చేరారు. ఉరవకొండ నియోజకవర్గ ఇన్‌చార్జిగా, జిల్లా ఉపాధ్యక్షుడిగా పనిచేసి, 2025లో అనంతపురం జిల్లా బీజేపీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టారు.
పార్టీ సంస్థాగత బలోపేతం, కార్యకర్తల సమన్వయం, ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారిస్తూ జిల్లాలో తన రాజకీయ పునాదిని విస్తరించుకుంటున్నారు. రాష్ట్రస్థాయి బీజేపీ నాయకులతో పాటు మంత్రి పయ్యావుల కేశవ్, మంత్రి సత్యకుమార్ యాదవ్, జనసేన, టీడీపీ నాయకులతో సత్సంబంధాలు తనకు అనుకూలిస్తాయని ఆయన ఆశాభావంతో ఉన్నట్లు సమాచారం.
జిల్లాలో బీసీ సామాజిక సమీకరణాలు, ఎన్డీఏ కూటమి అంతర్గత చర్చలు, మిత్రపక్షాల మధ్య పదవుల పంపకం వంటి అంశాలు చైర్మన్ ఎంపికలో కీలకంగా మారే అవకాశముంది. ఈ నేపథ్యంలో కొనకొండ్ల రాజేష్‌కు అవకాశం దక్కుతుందా? బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న ఆయన జిల్లా పరిషత్ పీఠాన్ని అధిరోహిస్తారా? అన్నది రాజకీయంగా ఆసక్తికరంగా మారింది.

# మందకొడిగా సాగిన తొలి రోజు నామినేషన్ల ప్రక్రియ

- **తొలి రోజు 10 నామినేషన్లు దాఖలు**
- **కౌన్సిలర్ స్థానాలకు.. ఒకటి చైర్‌పర్సన్ పదవికి**
- **టీడీపీ నుంచి 8, వైఎస్సార్సీపీ నుంచి ఒక కౌన్సిలర్ నామినేషన్**
- **చైర్‌పర్సన్ పదవికి బీఎస్పీ అభ్యర్థి నామినేషన్**

**హిందూపురం (మనం న్యూస్) అక్టోబర్ 16:** హిందూపురం పురపాలక సంఘం ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ శుక్రవారం ప్రారంభమైంది. తొలి రోజు నామినేషన్ల దాఖలు మందకొడిగా సాగింది. మున్సిపల్ కౌన్సిలర్ స్థానాలతో పాటు చైర్‌పర్సన్ పదవికి కలిపి మొత్తం 10 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారి, మున్సిపల్ కమిషనర్ వి. మల్లికార్జున వెల్లడించారు. వీటిలో కౌన్సిలర్ స్థానాలకు 9 నామినేషన్లు, చైర్‌పర్సన్ పదవికి ఒక నామినేషన్ వచ్చినట్లు తెలిపారు. హిందూపురం మున్సిపాలిటీలోని మొత్తం 52 వార్డులకు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో నామినేషన్ల స్వీకరణ కోసం అధికారులు రెండు కేంద్రాలను ఏర్పాటు చేశారు. 1 నుంచి 20వ వార్డు వరకు ఎంజీఎం ఉన్నత పాఠశాలలో, 21 నుంచి 52వ వార్డు వరకు మున్సిపల్ కార్యాలయంలో నామినేషన్లు స్వీకరిస్తున్నారు. తొలి రోజు అభ్యర్థులు తమ ప్రతిపాదకులు, మద్దతుదారులతో ఆయా కేంద్రాలకు చేరుకుని ఎన్నికల అధికారులకు నామినేషన్ పత్రాలను సమర్పించారు. మున్సిపల్ పరిధిలోని 37వ వార్డుకు తెలుగుదేశం పార్టీ తరపున కౌన్సిలర్ అభ్యర్థిగా ఎన్.ఆర్. సహన నామినేషన్ దాఖలు చేయడంతో తొలి రోజు నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. 15వ వార్డు అన్‌రిజర్వ్‌డ్‌గా ఉండటంతో ఆ వార్డుకు మాజీ కౌన్సిలర్ వి. దుర్గా మంజుల, ఆమె భర్త వి.పి. నవీన్ కుమార్ నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఇద్దరూ తలో సెట్ నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారులకు అందజేశారు.అదేవిధంగా 31వ వార్డుకు తెలుగుదేశం పార్టీ తరఫున శిరీష, 41వ వార్డుకు సి. ఆనంద్, 48వ వార్డుకు భారతి, 49వ వార్డుకు హరీష్ కుమార్ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు.వైఎస్సార్సీపీ తరఫున 43వ వార్డుకు ఫేక్ ఆయేషా నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారులకు సమర్పించారు.పర్సన్ అభ్యర్థిగా నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారులకు సమర్పించారు. దీంతో తొలి రోజు కౌన్సిలర్, చైర్‌పర్సన్ స్థానాలకు కలిపి మొత్తం 10 నామినేషన్లు నమోదయ్యాయి.
తొలి రోజు అందిన నామినేషన్లలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులవే అత్యధికంగా ఉన్నాయి. కౌన్సిలర్ స్థానాలకు సంబంధించి టీడీపీ తరఫున 8 నామినేషన్లు, వైఎస్సార్సీపీ తరఫున ఒక నామినేషన్ దాఖలయ్యాయి. చైర్‌పర్సన్ పదవికి బీఎస్పీ తరఫున ఒక నామినేషన్ దాఖలైంది. మొత్తంగా కౌన్సిలర్ స్థానాలకు 9, చైర్‌పర్సన్ పదవికి ఒకటి చొప్పున 10 నామినేషన్లు వచ్చినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. శని, ఆదివారాల్లో పెరగనున్న నామినేషన్లు



నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన తొలి రోజు కావడంతో అభ్యర్థుల సందడి పెద్దగా కనిపించలేదు. ప్రధాన రాజకీయ పార్టీల నుంచి ఇంకా పలువురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయాల్సి ఉంది. ఆయా పార్టీల్లో అభ్యర్థుల ఎంపిక, బీ–ఫారాలు తదితర అంశాలపై కసరత్తు కొనసాగుతున్న నేపథ్యంలో శనివారం, ఆదివారం నామినేషన్ల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.మున్సిపల్ ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలు, అవసరమైన ధ్రువపత్రాలతో నిర్ణీత సమయంలో సంబంధిత నామినేషన్ స్వీకరణ కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. నామినేషన్ల ప్రక్రియ ఊపందుకుంటే రానున్న రెండు రోజుల్లో హిందూపురం మున్సిపల్ ఎన్నికల రాజకీయ వాతావరణం మరింత వేడెక్కే అవకాశముంది.

















# ధర్మవరంలో వైభవంగా దసరా శరన్నవరాత్రులు.. వివిధ అలంకారాల్లో అమ్మవార్ల దర్శనం

**ధర్మవరం, అక్టోబర్ 16 (మనం న్యూస్) :** శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలో దసరా శరన్నవరాత్రుల ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. నవరాత్రుల ఆరవ రోజు శుక్రవారంపట్టణంలోని పలు ఆలయాల్లో అమ్మవార్లు వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ధర్మవరంలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవస్థానంలో అమ్మవారు శ్రీ లలితా త్రిపుర సుందరి దేవిఅలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కొత్తపేటలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారు లక్ష్మీ ధన్వంతరి దేవి అలంకారంలో దర్శనమిచ్చారు. సాయిబాబా దేవాలయంలో అమ్మవారు సరస్వతీ దేవి అలంకారంలో కొలువుదీరారు. నేసేపేటలోని శ్రీ అంబాభవాని దేవస్థానంలో అమ్మవారిని సరస్వతీ దేవి అలంకారంలో ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అలాగే యాదవ వీధిలోని శ్రీ వేదమాత గాయత్రీ దేవి ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మీ దేవి అలంకారంలోలిలి భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. నవరాత్రుల సందర్భంగా పట్టణంలోని ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. అమ్మవార్ల దివ్యదర్శనంతో భక్తులు ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందారు.

# ఎన్నికల దృష్ట్యా కుందుర్పిలో అన్ని రాజకీయ పార్టీల సమావేశం.



**కుందుర్పి అక్టోబర్ 16 (మనం న్యూస్):.** మండల పరిషత్ మరియు జిల్లా ప్రజా పరిషత్ ఎన్నికల దృష్ట్యా కందుర్పి మండల పరిషత్ కార్యాలయంలో రేపు అనగా శనివారం 17.న ఉదయం 11:00 గంటలకు అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో అత్యవసర సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.నాగలింగేశ్వర రెడ్డి,ఎఆర్ఓ ,ఇ, లక్ష్మి శంకర్ శుక్రవారం మనం సినీయర్ జర్నలిస్ట్ కు తెలిపారు.ఈ సమావేశం మండల ప్రత్యేక అధికారి ,కె,నాగలింగేశ్వర రెడ్డి అధ్యక్షతన మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఈ సమావేశం జరుగుతుందని, వారు పేర్కొన్నారు.కావున కుందుర్పి మండల పరిధిలోని అన్ని రాజకీయ పార్టీలకు సంబంధించిన ప్రతినిధులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన ఈసందర్భంగా విజ్ఞప్తి చేశారు.ఈ అవకాశంను సద్వినియోగం చేసుకోవాలని ప్రతినిదులు ను కోరారు.

# పుర పోరుకు పట్టణ ఐటిడిపి సిద్ధం.

**హిందూపురం (మనం న్యూస్) అక్టోబర్ 16.** స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగిన నేపథ్యంలో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆదేశాల మేరకు హిందూపురం పట్టణం ఐటిడిపి సభ్యులు శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో అనుసరించాల్సిన క్రియలపై చర్చించడం జరిగింది.అదే విధంగా నామినేషన్ పత్రాల పూరించడం ఇబ్బంది పడకూడదని స్థానిక ఎమ్మెల్యే కార్యాలయం వద్ద ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి వార్డు కౌన్సిలర్ అభ్యర్థుల నామినేషన్ పత్రాలను పూరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐటిడిపి పార్లమెంటు అధ్యక్షుడు రామాంజనేయులు, నియోజకవర్గ అధ్యక్షుడు నజీర్ అహ్మద్, అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి కొల్లకుంట సురేష్, పట్టణాధ్యక్షుడు అనిల్ కుమార్, మన్సూర్, జహీర్, షేక్షా, నవీన్ మరియు ఐటీడిపి వార్డుల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.



# శింగనమల మండల కేంద్రంలో విస్తృత స్థాయి సమావేశం.... ఎమ్మెల్యే బండారి శ్రావణి శ్రీ

**శింగనమల అక్టోబర్ 16 మనం న్యూస్** శింగనమల మండల కేంద్రంలో స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహకాల్లో భాగంగా నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశం లో ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో అభివృద్ధిని చూసి ఓటు అడుగుదామని, ప్రజలకు చేసిన మంచిని, చేపట్టిన అభివృద్ధి పనులను వివరించి ప్రజల మద్దతు కోరుదామని కూటమి నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి గ్రామంలోనూ, ప్రతి ఇంటికీ విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలు, నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి పనులు, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి చేస్తున్న కృషిని ప్రజలకు వివరించి, ప్రభుత్వ లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని పేర్కొన్నారు.

ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి

పార్టీకి కార్యకర్తలే వెన్నెముక అని, ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా క్రమశిక్షణతో, అంకితభావంతో పనిచేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కేవలం ఎన్నికల సమయంలోనే కాకుండా నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. గ్రామస్థాయిలో ప్రజలతో మమేకమై, ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా నిలవాలని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు పరస్పర గౌరవంతో, సమన్వయంతో పనిచేస్తూ కూటమి ఐక్యతను మరింత బలోపేతం చేయాలని స్పష్టం చేశారు.

నియోజకవర్గ అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా ప్రతి ఒక్కరూ అహర్నిశలు శ్రమించాలని ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ పేర్కొన్నారు.

గ్రామాల్లో శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టడం, యువతకు మెరుగైన అవకాశాలు కల్పించడం, పిల్లలకు నాణ్యమైన విద్య అందించడం,



రైతులకు అండగా నిలవడం, మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించడం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.

తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేస్తూ ప్రజల విశ్వాసాన్ని మరింతగా సంపాదించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. వ్యక్తిగత అభిప్రాయాలు, విభేదాలకు తావివ్వకుండా కూటమి ప్రయోజనాలను, ప్రజల సంక్షేమాన్ని ప్రథమ ప్రాధాన్యతగా తీసుకోవాలని సూచించారు. ప్రతి గ్రామంలో పార్టీని బలోపేతం చేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు.

ఈ సమావేశంలో ఏపీ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ మరియు శింగనమల నియోజకవర్గ పరిశీలకులు సుబ్బారెడ్డి , ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరస నాయుడు తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సీహెచ్‌సీ ని సందర్శించిన జిల్లా ఆసుపత్రి సేవల కోఆర్డినేటర్ డా.ఈ.వెంకటరావు

**ఐవీఆర్ఎస్ నివేదిక, డాక్టర్ల లభ్యత, మందులు, అవినీతి, పారిశుధ్య సేవలపై సమీక్ష**

**శింగనమల, అనంతపురం జిల్లా ఆసుపత్రి సేవల కోఆర్డినేటర్.డి సి హెచ్ ఎస్. డా. ఈ. వెంకటరావు గురువారం ఆకస్మికంగా కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) సందర్శించి సేవల పనితీరును సమీక్షించారు.**



**శింగనమల అక్టోబర్ 16 మనం న్యూస్:** అనంతరం ఐవీఆర్ఎస్ (ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్) నివేదికను పరిశీలించారు. డాక్టర్ల హాజరు, ముఖ్యంగా డ్రాప్ అయిన డాక్టర్ల వివరాలు, రోగులకు సకాలంలో సేవలు అందుతున్నాయా లేదా అనే అంశాలపై విచారణ చేశారు. ఆసుపత్రిలో మందుల లభ్యత, అవసరమైన మందులు తగినంతగా ఉన్నాయా, సరఫరాలో ఏవైనా లోపాలున్నాయా అని పరిశీలించారు. అవినీతి ఫిర్యాదులు, సేవల్లో అక్రమాలు జరుగుతున్నాయా అనే అంశాలపై కూడా ఆరా తీశారు. అదనంగా పారిశుధ్య సేవలు, ఆసుపత్రి ఆవరణ శుభ్రత, వ్యర్థాల నిర్వహణ, బయోమెడికల్ వేస్ట్ డిస్పోజల్ పద్ధతులపై విచారణ నిర్వహించారు.ఆకస్మిక సందర్శన వల్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, రోగులకు నాణ్యమైన సేవలు అందించాలని డా. ఈ. వెంకటరావు ఆదేశించారు. లోపాలు ఉన్నచోట వెంటనే సరిదిద్దుకోవాలని, ఐవీఆర్ఎస్ ద్వారా వచ్చే ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు.సందర్శన సమయంలో ఆసుపత్రి వైద్యాధికారి, సిబ్బంది వివరాలు అందజేశారు. జిల్లా స్థాయి అధికారుల ఆకస్మిక పర్యవేక్షణతో ఆసుపత్రి సేవల్లో మరింత పారదర్శకత, నాణ్యత పెరుగుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# సెమీ ఫైనల్ గెలిస్తేనే ఫైనల్ మ్యాచ్ అని గుర్తు పెట్టుకోవాలి

**ఓబుల దేవర చెరువు అక్టోబర్ 16 మనం న్యూస్:**

ఓడిచెరువు:లి సెమీ ఫైనల్ మ్యాచ్ లాంటి ప్రస్తుత స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధిస్తేనే సార్వత్రిక ఎన్నికలకు (ఫైనల్ మ్యాచ్) మార్గం సుగమం అవుతుందని పుట్టపర్తి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి పిలుపునిచ్చారు.

ఓడిచెరువు మండల కేంద్రంలోని ఐటీఐ కళాశాల ఆవరణలో శుక్రవారం వైఎస్సార్సీపీ కార్యకర్తల సమన్వయ సమావేశం మండల కన్వీనర్ కుప్పనగారి లక్ష్మీరెడ్డి అధ్యక్షతన జరిగింది.



ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుత స్థానిక సంస్థల ఎన్నికలు రాబోయే జగనన్న ప్రభుత్వానికి రెఫరెండంగా భావించి ప్రతి కార్యకర్త శక్తివంచన లేకుండా పనిచేయాలని కోరారు.

ఈ సమావేశానికి హాజరైన అశేష జనవాహినిని ఉద్దేశించి మాట్లాడుతూ.. మనం అధికారంలో ఉన్నామా అనే భ్రమ కలుగుతోందని, ప్రతిపక్షంలో సైతం ఇంత భారీ సంఖ్యలో జనం హాజరుకావడం ఎంతో సంతోషాన్నిస్తోందని, హాజరైన ప్రతి ఒక్కరికీ నా ప్రత్యేక ధన్యవాదాలు అని తెలిపారు. కూటమి ప్రభుత్వం కుటిల రాజకీయాలకు నిదర్శనమని, ఎన్నికల వేళ కొత్త పింఛన్లకు ఆశ చూపి ఓట్లు కొల్లగొట్టాలని చూస్తున్నారని, , ఎన్నికల అనంతరం కొత్త పింఛన్లన్నీ చెత్తబుట్టలో పడేస్తాడని, ఎంపీటీసీ స్థానాలు గెలిచి మన సత్తా ఏంటో చూపించాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో వైయస్సార్ పార్టీ మండల కన్వీనర్ లక్ష్మిరెడ్డి మాజీ జడ్పీటీసీ దామోదర్ రెడ్డి మాజీ ఎంపీపీ భర్త షామీర్ భాష , కోళ్ల కృష్ణారెడ్డి హరినాథ్ రెడ్డి రాజు నాయుడు , నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.